మహబూబ్‌నగర్ వార్త



నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగుళాంబ గద్వాల / నారాయణపేట

# హరితహారం కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములవ్వాలి..

## విద్యార్థులకు బేస్‌లైన్ టెస్ట్.. పెద్ద మొక్కలు నాటాలి కలెక్టర్ కోయ శ్రీహర్ష



విద్యార్థితో మాట్లాడుతున్న కలెక్టర్

**ఉట్కూర్,జూలై 13 ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుని ప్రతి సంవత్సరం నిర్వహించే హరితహారం కార్యక్రమంలో ప్రజలు, ప్రజా ప్రతినిధులు, అధికారులు ప్రతి ఒక్కరిని భాగస్వాములను చేయాలని అన్నారు. కార్యక్రమంలో నాటే ప్రతిమొక్క పెద్దగా రెండు మీటర్ల ఎత్తు ఉండాలని అన్నారు. అదనపు కలెక్టర్ మయాంక్ మిత్తల్‌తో కలిసి పర్యటించిన జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు. ఉట్కూర్ మండలం లక్ష్మిపల్లి, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, మొగ్దుంపూర్ మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల, పులిమామిడి కస్తూర్బా పాఠశాల, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రహరీగోడ నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయించాలని ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యాన్ని అందించాలన్నారు. అంగన్‌వాడి కేంద్రం తనిఖీ చేసి సమయానికి కోడిగుడ్లు అందుతున్నాయా, పిల్లలకు బాలామృతం అందిస్తున్నారా లేదా అనే విషయాన్ని అడిగి తెలుసుకున్నారు. కస్తూర్బా పాఠశాలలో కిచెన్ రూంను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఓ తదితరులు ఉన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్

# పెండింగ్ పనులు త్వరితగతిన పూర్తి చేయండి

## ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి

**భూత్పూర్,జూలై13 ప్రభాతవార్త :** రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని పెండింగ్ పనులు సత్వరం పూర్తి చేయాలని దేవరకద్ర ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం తన క్యాంపు కార్యాలయమైన భూత్పూర్ మండలం అన్నాసాగర్‌లో ఆర్‌అండ్‌బి, పిఆర్‌రోడ్డు,బ్రిడ్జి,కాలువల నిర్మాణపనులపై అధికారులతో సమీక్ష నిర్వహించారు.



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న ఎమ్మెల్యే ఆల

ఈసందర్బంగా ఎమ్మెల్యే ఆల మాట్లాడుతూ వర్నె, మదనాపురం, వడ్డెమాన్, జంగమాయపల్లి, కరివెన, కొత్తమొల్గర, జెసిఎల్ లింక్ రోడ్, బిటి సర్వీస్ రోడ్లు, ఆర్‌ఓబి పనులు సత్వరం పూర్తి చేయాలని కోరారు. సంబంధిత జిల్లా అధికారులతో ఎమ్మెల్యే చరవాణిలో మాట్లాడి సత్వరం పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, ఇంజనీర్లు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# వనపర్తిలో కాంగ్రెస్ జెండాను ఎగరవేద్దాం..

- బీఆర్ఎస్ ప్రభుత్వంపై ప్రజలు తీవ్ర వ్యతిరేకతతో ఉన్నారు
- మాజీ మంత్రి చిన్నారెడ్డిని కలిసిన మేఘారెడ్డి టీమ్
- కొల్లాపూర్ బహిరంగ సభ ఏర్పాట్లపై సుదీర్ఘ చర్చ

**వనపర్తి, జూలై 13, ప్రభాతవార్త:** వనపర్తి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, అభిమానులు ఐక్యంగా ముందుకు సాగి ఈ ఎన్నికల్లో వనపర్తి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని గెలిపించాలని వనపర్తి నియోజకవర్గ నాయకులు పెద్దమందడి ఎంపీపీ మేఘారెడ్డి పిలుపునిచ్చారు. ఈనెల 20వ తేదీన కొల్లాపూర్‌లో జరిగే ప్రియాంకగాంధీ బహిరంగ సభలో కాంగ్రెస్ పార్టీలో మేఘారెడ్డి చేరనున్న నేపథ్యంలో గురువారం మేఘారెడ్డి బృందం వనపర్తిలోని ఏఐసీసీ కార్యదర్శి రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ చైర్మన్ డాక్టర్ జి. చిన్నారెడ్డి నివాసానికి వెళ్లి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మేఘారెడ్డికి మాజీ మంత్రి చిన్నారెడ్డి సాధారంగా స్వాగతం పలికారు. బీఆర్ఎస్ ప్రభుత్వంపై తెలంగాణ ప్రజలు తీవ్ర వ్యతిరేకతతో ఉన్నారని ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున గెలిచి తెలంగాణలో అధికారం చేజిక్కించుకుంటారని మేఘారెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గెలుపే ధ్యేయంగా పాత కార్యకర్తలు, కొత్తగా కాంగ్రెస్ పార్టీలో చేరబోయే కార్యకర్తలు కలిసికట్టుగా పని చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈనెల 20వ తేదీన కొల్లాపూర్ పట్టణంలో నిర్వహించే భారీ బహిరంగ సభకు ప్రియాంక గాంధీ హాజరు కానున్నారని ఆ సభలో జూపల్లి కృష్ణారావు, నాగర్‌కర్నూల్ ఎమ్మెల్సీ కూచకుళ్ల దామోధర్ రెడ్డి, ఆయన తనయుడు రాజేశ్వర్ రెడ్డి , గద్వాల జిల్లా పరిషత్ చైర్మన్ సరిత తిరుపతయ్య లు కాంగ్రెస్ పార్టీలో చేరనున్నారు. కొల్లాపూర్ సభను విజయవంతం చేసేందుకు ఈనెల 15వ తేదీన కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం వనపర్తిలో నిర్వహిస్తామని మేఘారెడ్డి తెలిపారు. కొల్లాపూర్ సభకు వనపర్తి నియోజకవర్గం నుండి దాదాపు 30వేల నుండి 35 వేల దాకా జనాలను తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు మేఘారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో సింగిల్‌విండో మాజీ అధ్యక్షులు ఐ.సత్యారెడ్డి, పొలికెపాడు మాజీ సర్పంచ్ సత్యశీలారెడ్డి, పెద్దమందడి కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పెంటన్న, కౌన్సిలర్లు రాధాకృష్ణ, నాయకులు గట్టు యాదవ్, తిరుపతి రెడ్డి, సుంచరమోని వెంకటయ్య, తిరుపతి యాదవ్, దివాకర్ తదితరులు ఉన్నారు.



కొల్లాపూర్ బహిరంగ సభపై చర్చిస్తున్న మాజీమంత్రి చిన్నారెడ్డి, ఎంపీపీ మేఘారెడ్డి

# పోలీసులకు ఉత్తమ సేవా పతకాలు..

- హోంశాఖ ఉత్తర్వులు జారీ..
- 11మందిని అభినందించిన ఎస్పీ నరసింహా



**మహబూబ్‌నగర్ బ్యూరో, జూలై 13, ప్రభాతవార్త :** 2013 రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా మహబూబ్‌నగర్ జిల్లా పోలీస్ సిబ్బంది ఇద్దరికి ఉత్తమ సేవా పతకం,9మందికి సేవాపతకం లభించింది. ఈమేరకు రాష్ట్రహోంశాఖ నుంచి ఉత్తర్వులు జారీ అయినట్లు ఎస్పీ నరసింహ గురువారం తెలిపారు. ఉత్తమ సేవా పతకాలు పొందిన పోలీసులను ఎస్పీ అభినందించారు. వీరికి ఆగస్టు 15న స్వతంత్ర్య దినోత్సవం సందర్భంగా పతకాలు బహూకరించనునట్లు తెలిపారు.

**ఉత్తమ సేవాపతకం పొందినవారు :**
ఎండీ నయిం, ఏఎస్సై భూత్పూర్, జి గోవర్ధన్ ఏఆర్ఎస్సై

**సేవాపతకం పొందినవారు :** జగన్నాథం ఎస్సై వన్‌టౌన్ పీఎస్, కృష్ణయ్య గౌడ్ ఏఎస్సై భూత్పూర్, అబ్దుల్ జమీర్ ఏఆర్ఎస్సై, ఈ రాముల ఏఆర్ఎస్సై, జీ ఉషనయ్ ఏఆర్ఎస్సై, పీ రాములు ఏఆర్‌హెచ్‌సీ, మీర్జా అహ్మద్ బేగ్ పీసీ697సీసీఎస్ పీఎస్, ఎండీ జమీరుద్దీన్ ఏఆర్‌పీసీ2800, ఏ సురేశ్‌కుమార్ పీసీ1924 దేవరకద్ర పీఎస్.

# రూ.లక్ష సాయం నిరంతర ప్రక్రియ..!

- జూలై 15 నుంచి మొదటి విడుత చెక్కుల పంపిణీ
- వీసీలో వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ మంత్రి గంగుల కమలాకర్

**మహబూబ్‌నగర్ బ్యూరో, జూలై 13, ప్రభాతవార్త :** వెనుకబడిన తరగతులకు చెందిన కులాల వారికి ఇచ్చే రూ.లక్ష ఆర్థికసాయం నిరంతరంగా కొనసాగుతుందని, ఈ పథకం కింద మొదటి విడుత చెక్కుల పంపిణీ కార్యక్రమం జూలై15 నుంచి ప్రారంభించనున్నట్లు వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ మంత్రి గంగుల కమలాకర్ వెల్లడించారు. బీసీ కులవృత్తులు, చేతివృత్తుల వారికి అందించే లక్ష ఆర్థికసాయం విషయమై గురువారం ఆయన హైదరాబాద్ నుంచి రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి బుర్రా వెంకటేశం, ఇతర రాష్ట్ర స్థాయి అధికారులు, జిల్లాల కలెక్టర్లతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కులవృత్తులకు చేయూతనివ్వడంలో భాగంగా రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ రూ.లక్ష ఆర్థికసాయం కార్యక్రమాన్ని తీసుకురావడం జరిగిందన్నారు. మొదటి విడుత అసెంబ్లీ నియోజకవర్గానికి 300మంది లబ్ధిదారులనె ఎంపిక చేయాలని తెలిపారు. ఈ పథకం నిరంతరంగా కొనసాగుతుందని, ప్రతినెలా అర్హత ఉన్న లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ కార్యక్రమం ఉంటుందన్నారు. ముందుగా గుర్తించిన 15కులాల లబ్ధిదారులకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. బుర్రాకవెంకటేశం మాట్లాడుతూ లక్ష రూపాయల ఆర్థికసాయానికి 5లక్షల28వేల దరఖాస్తులు వచ్చాయని వీటనినంటినీ కలెక్టర్లు పరిశీలించి ఆన్‌లైన్‌లో నమోదు చేశారన్నారు. శాసన సభ్యుల సమక్షంలోనే చెక్కులు పంపిణీ చేయాలన్నారు. జిల్లా కలెక్టర్ రవినాయక్ మాట్లాడుతూ జిల్లాలో మొదటి విడుత చెక్కుల పంపిణీకి సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు.



వీసీకి హాజరైన కలెక్టర్ జి రవినాయక్



వీసీలో మాట్లాడుతున్న మంత్రి గంగుల కమలాకర్

# సంక్షేమ పథకాలను చూసి ఓర్వలేక కాంగ్రెస్ కుట్ర..!

## అమెరికాలో రేవంత్‌రెడ్డి తన నిజస్వరూపాన్ని బయట పెట్టుకున్నాడు .. విద్యుత్ భవన్ వద్ద నిరసన కార్యక్రమంలో మంత్రి శ్రీనివాస్‌గౌడ్

**మహబూబ్‌నగర్ బ్యూరో,జూలై 13 ప్రభాతవార్త :** రైతుల కోసం తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉచిత విద్యుత్ లాంటి సంక్షేమ పథకాలను చూసి ఓర్వలేక టిపిసిసి అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి కుట్రలు చేస్తున్నాడని రాష్ట్ర ఎక్సైజ్‌శాఖ మంత్రి డా.వి. శ్రీనివాస్‌గౌడ్ విమర్శించారు. స్వదేశంలో విమర్శిస్తే ప్రజలకు తెలుస్తుందనే భయంతో అమెరికాలో రేవంత్‌రెడ్డి తన నిజస్వరూపాన్ని విద్యుత్ వ్యతిరేక వ్యాఖ్యలతో బయటపెట్టుకున్నాడని మంత్రి దుయ్యబట్టారు. తక్షణమే రేవంత్‌రెడ్డి ముక్కు నేలకు రాసి తెలంగాణ రైతాంగానికి క్షమాపణలు చెప్పకుంటే వదిలే ప్రసక్తే లేదని ఆయన హెచ్చరించారు. వ్యవసాయానికి 24 గంటల ఉచిత విద్యుత్ అవసరం లేదంటూ రైతులను అవమానించిన టిపిసిసి అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి వ్యవహార శైలికి నిరసనగా మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని వెంకటేశ్వర కాలనీలో ఉన్న విద్యుత్ భవన్ ఎదుట గురువారం నాడు బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నిరసన కార్యక్రమంలో రేవంత్‌రెడ్డి తీరును మంత్రి దుయ్యబట్టారు. స్వాతంత్రం వచ్చినప్పటి నుంచి దేశాన్ని పాలించిన కాంగ్రెస్ పార్టీ వల్ల రైతుకు ఎన్నడు ప్రయోజనం చేకూరలేదని వారి పాలనలో కరెంటు లేక రైతు ఆగమయిందని మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. పగటిపూట మూడు గంటలు రాత్రిపూట మూడు గంటలు మాత్రమే ఇచ్చి అన్నదాత ఆగమయ్యేలా చేశారని విమర్శించారు. మళ్లీ 3 గంటల కరెంటుతో రైతును ఆగం చేయాలని రేవంత్ కుట్ర చేస్తున్నాడని అన్నారు. నిన్న ధరణి, నేడు కరెంటు భవిష్యత్తులో రైతుబందు, రైతుభీమా సహా సంక్షేమ పథకాలు ఏవి వద్దంటడని మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. ప్రజలంతా సుఖసంతోషాలతో ఉంటే ఓర్వలేక రేవంత్‌రెడ్డి కుట్రలకు పాల్పడుతున్నాడని అన్నారు. కాంగ్రెస్ హయాంలో మోటార్లు, ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోయి రైతులు ఎంతో అవస్థలు పడేవారని సక్రమంగా కరెంటు ఇవ్వాలని బషీర్‌బాగ్‌లో ఆందోళన చేసిన అన్నదాతలపై కాల్పులు జరిపి ప్రాణాలు తీశారని అన్నారు. కాంగ్రెస్ పాలనలో విద్యుత్ ఉద్యోగులు సిబ్బంది గ్రామాలకు వెళ్తే రైతులు, ప్రజలు దాడి చేస్తారనే భయంతో బిక్కుబిక్కుమని గడిపేవారని తెలంగాణ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఆ సమస్యలన్నింటికి పరిష్కారం చూపించామన్నారు. మళ్లీ మూడు గంటల కరెంటు తీసుకువచ్చి రైతులు, విద్యుత్ సిబ్బంది ఇద్దరికి కంటి నిండా కునుకు లేకుండా చేయాలని రేవంత్‌రెడ్డి కుట్రలు చేస్తున్నాడన్నారు. ఆయన చేసిన వ్యాఖ్యలకు రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారని అన్నారు. సరైన కరెంటు లేకుంటే పరిశ్రమలు మూతపడతాయని వ్యవసాయం కుంటుపడుతుందని తద్వారా అందరికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేకుండా పోయే ప్రమాదం ఉందన్నారు. వ్యవసాయానికి ఉచితంగా సరఫరా అవుతున్న 24 గంటల కరెంటు వద్దన్నందుకు రేవంత్‌రెడ్డి చెంపలు వేసుకుని ముక్కు నేలకు రాసి రైతులందరికి క్షమాపణ చెప్పాలని లేదంటే వదిలిపెట్టే ప్రసక్తి లేదని శ్రీనివాస్‌గౌడ్ హెచ్చరించారు. రైతు వ్యతిరేక రేవంత్‌కు రైతులే తగిన గుణపఠం చెప్తారన్నారు. కార్యక్రమంలో ముడా చైర్మన్ గంజి వెంకన్న, మున్సిపల్ చైర్మన్ కెసి నర్సింహులు, జిల్లా గొర్రెల కాపరుల సహకార సంఘం అధ్యక్షులు శాంతన్న యాదవ్, మార్కెట్ కమిటి చైర్మన్ రహమాన్, వైస్ చైర్మన్ గిరిధర్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ గణేష్, రైతుబంధు సమితి పట్టణ అధ్యక్షుడు గోనెల రాములు, వివిధ మండలాల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, జడ్పీటిసిలు, ఎంపిపిలు, ఎంపిటిసిలు, సర్పంచ్‌లు, కౌన్సిలర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, రైతులు పెద్ద ఎత్తున తరలివచ్చి ఈ నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు.





విద్యుత్ భవన్ వద్ద నిరసనగా పాల్గొన్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్

# కార్పొరేట్‌కు ధీటుగా వసతులు..!

- పోలెపల్లి జెడ్పీ హైస్కూల్‌లో 54.87లక్షలతో చేపట్టిన పనులు ప్రారంభం
- సర్కార్ బడుల రూపురేఖలు మారాయి:ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

**మహబూబ్‌నగర్ బ్యూరో, జూలై 13, ప్రభాతవార్త :** తెలంగాణ ప్రభుత్వ విద్య, వైద్యానికి ప్రాధాన్యత ఇస్తున్నదని, సర్కార్ చర్యలతో బడుల రూపురేఖలు మారాయని ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి అన్నారు. జడ్చర్ల మండల పరిధిలోని పోలెపల్లిలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో మన ఊరు మన బడి పథకం కింద రూ.54.87లక్షలతో చేపట్టిన అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ బడిలో ప్రొజెక్టర్, డిజిటల్ బోర్డులు, బాలికలకు టాయిలెట్స్, మౌలిక వసతులు కల్పించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. వెయ్యికి పైగా గురుకులాలు స్థాపించి నాణ్యమైన భోజనంతోపాటు కార్పొరేట్ స్థాయి విద్యనందిస్తున్నదని తెలిపారు. గురుకులాల విద్యార్థులు నేడు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వ విధానాలతో బడుల్లో వసతులు పెరిగాయిని, ఉపాధ్యాయులకు సైతం గౌరవం పెరిగిందన్నారు. గతంలో కరెంట్ సక్రమంగా లేక విద్యార్థులు దీపాల వెలుగులో చదువులు కొనసాగించారని గుర్తుచేశారు.టీపీసీసీ అధ్యక్షుడు రైతులకు 24గంటల కరెంట్ అవసరం లేదు అనడంపై ఎమ్మెల్యే ఫైర్ అయ్యారు. గతంలో 7గంటలు చెప్పి, 3గంటలు కరెంట్ ఇచ్చిన చరిత్ర కాంగ్రెస్‌ది అని, 24 గంటల నిరంతర విద్యుత్ అందిస్తూ రైతులకు కాపాడుంటుకున్న ప్రభుత్వం మాదన్నారు. రైతు వ్యతిరేఖ విధానాలు అవలంభిస్తున్న కాంగ్రెస్‌కు రైతులే బుద్ధి చెప్పాలని కోరారు. అనంతరం రేవంత్ వ్యాఖ్యలకు నిరసనగా పోలెపల్లి విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రైతులు చేపట్టిన నిరసన కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ కోడ్గల్ యాదయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ మన్యం గోవర్ధన్‌రెడ్డి, సర్పంచుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రణీల్‌చందర్, పీఎసీసీఎస్ చైర్మన్ సుదర్శన్‌గౌడ్, ఎంఈవో మంజులాదేవి, సర్పంచ్ జనంపల్లి చేతన, ముడా డైరెక్టర్లు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.



విద్యార్థులకు అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి



డిజిటల్ బోర్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

# 'రూర్బన్' పనులు త్వరితగతిన చేపట్టాలి..!

## - మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టర్ రవినాయక్

**మహబూబ్‌నగర్‌బ్యూరో,జూలై13,ప్రభాతవార్త :** రూర్బన్ పథకం కింద చేపట్టిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ జి రవినాయక్ అధికారులను ఆదేశించారు.గురువారం ఆయన నూతనకలెక్టరేట్ కార్యాలయంలోని తన చాంబర్‌లో పరిగి శాసనసభ్యుడు కొప్పుల మహేశ్‌రెడ్డితో కలిసి గండీడ్ మండలంలో చేపట్టిన రూర్బన్ పనులపై సమీక్షించారు. ఇప్పటివరకు ఇంకా మొదలుపెట్టిన పనులను వెంటనే ప్రారంభించాలని, సాధ్యమైనంత త్వరంగా పనులు పూర్తిచేయాలని ఆదేశించారు. విద్యుత్ కనెక్షన్లు, ఉద్యాన పందిళ్లు, పంచాయతీ రాజ్, టీఎస్ ఈడబ్ల్యూసీకి సంబంధించిన పనులు పెండింగ్‌లో ఉన్నాయని సంబంధిత శాఖ ఇంజినీరింగ్ అధికారులు వీటిపై దృష్టి సారించాలన్నారు. ఎమ్మెల్యే కొప్పుల మహేశ్ మాట్లాడుతూ వ్యవసాయ గోదాము,దాల్ మిల్, విద్యుత్ కనెక్షన్లు, ఇటీవల ప్రారంభించిన మిల్క్ చిల్లింగ్ సెంటర్‌లో సదుపాయాలు కల్పన వెంటనే పూర్తి చేయాలని కోరారు. అలాగే ఈ పంచాయతీకి సంబంధించిన సిస్టమ్స్‌ను ఏర్పాటు చేయాలన్నారు. కష్టం హైరింగ్ సెంటర్లకు లబ్ధిదారులను గురించి సాధ్యమైనంత త్వరగా వాటిని ప్రారంభించేందుకు చర్యతు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీవో యాదయ్య, అటవీ శాఖ అధికారి సత్యనారాయణ, వైద్య ఆరగ్యో శాఖ అధికారి కృష్ణ, రెడ్కో డిఎం డెయిరీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డీడీ , పంచాయతీరాజ్ ఈఈ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి, చిత్రంలో కలెక్టర్ రవినాయక్

# ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి బీఆర్ఎస్ ప్రభుత్వం కృషి..!

## - రూ.50లక్షలతో పాఠశాలలో అదనపు గదుల నిర్మాణానికి శంకుస్థాపన:ఎమ్మెల్యే మర్రి జనార్ధన్‌రెడ్డి



పాఠశాల అదనపు గదుల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే



ఇంగ్లీష్‌లో మాట్లాడుతున్న విద్యార్థి యశ్వంత్‌ను అభినందిస్తున్న ఎమ్మెల్యే




యాదవ కమ్యూనిటీ భవన్ ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, జూలై 13 ప్రభాతవార్త:** ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి బీఆర్ఎస్ ప్రభుత్వం అహర్నిశలు కృషి చేస్తుందని ఎమ్మెల్యే మర్రి జనార్ధన్‌రెడ్డి అన్నారు. ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులు విద్యను బోధిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. గురువారం బిజినపల్లి మండలంలోని వట్టెం గ్రామంలో మన ఊరు - మన బడి కార్యక్రమంలో భాగంగా రూ.50లక్షలతో బాలుర ప్రాథమిక పాఠశాలలో అదనపు తరగతి గదులు, పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఎమ్మెల్యే మర్రి జనార్ధన్‌రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి భైకాని శ్రీనివాస్‌యాదవ్‌లు శంకుస్థాపనలు చేసి ప్రారంభించారు. అనంతరం విద్యార్థులు ఇంగ్లీష్‌లో ఆనర్గళంగా మాట్లాడుతూ ఎమ్మెల్యే సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత పాలకుల పాలనలో సర్కార్ బడికి రావాలంటే బయపడేవాళ్లని, నేడు తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ప్రభుత్వ పాఠశాలల్లో 2వ తరగతి చదువుతున్న యశ్వంత్ అనే విద్యార్థి ఆనర్గళంగా ఇంగ్లీష్‌లో మాట్లాడటం కేసీఆర్ పాలనకు నిదర్శనం కదా అని ఆయన అన్నారు. యశ్వంత్ అనే విద్యార్థి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాల గురించి వివరిస్తుంటే ఆశ్చర్యం వ్యక్తం చేస్తూ...విద్యార్థికి ప్రభుత్వం ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాల గురించి తెలుసు కానీ ప్రతిపక్ష పార్టీల నాయకులకు మాత్రం తెలియదా అంటూ ఎద్దేవా చేశారు. విద్యార్థులకు మంచి బోధన అందజేస్తున్న ఉపాధ్యాయులను అభినందించారు. కార్యక్రమంలో పలువురు ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**రూ.12లక్షలతో యాదవ కమ్యూనిటీ హాల్ ప్రారంభం...**

వట్టెం గ్రామంలో ఎమ్మెల్యే సీడీపీ నిధులు రూ.12 లక్షలతో కొత్తగా నిర్మించిన యాదవ కమ్యూనిటీ హాల్‌ను బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి భైకాని శ్రీనివాస్‌యాదవ్‌తో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 9 సంవత్సరాల క్రితం తెలంగాణ రాష్ట్రం ఎలా ఉందో, ప్రస్తుతం ఏ విధమైన అభివృద్ధి సాధించిందో ప్రజలు ఆలోచించుకోవాలన్నారు. నూటికి 50 శాతం ఉన్న మహిళలకు తాగే నీళ్ల కోసం బోరింగ్‌లు కొట్టి కొట్టి చేతులు పోయినవి కానీ నేడు స్వరాష్ట్రంలో ఇంటి ముందుకే మిషన్ భగీరథ పథకం ద్వారా మంచినీరు అందుతుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయంలో ఎవరైన చనిపోతే అపద్బాందు పథకం క్రింద రూ.50వేలు ఇస్తుండే కానీ నేడు కేసీఆర్ ముఖ్యమంత్రి అయిన తర్వాత ఒక రైతు చనిపోఏ ఎలాంటి కారణం లేకుండానే 11 రోజుల్లో రూ.5లక్షలు అందిస్తున్న ఏకైక ప్రభుత్వం కేసీఆర్ ప్రభుత్వమన్నారు. తెలంగాణ ప్రజలు సీఎం కేసీఆర్ పాలనలో ఆత్మ గౌరవంతో బ్రతుకుతున్నారని, మీకు 24 గంటల విద్యుత్, రైతుబంధు, రైతు భీమా, సాగునీరు అందిస్తున్న ప్రభుత్వం కావాలా లేదా ఆలోచించుకోవాలన్నారు. కాంగ్రెస్ పార్టీ చేస్తున్న మోసపూరిత హామీలు నమ్మి మోసపోవద్దని, నాగర్‌కర్నూల్‌కు మెడికల్ కళాశాల తీసుకొచ్చానని, నాగర్‌కర్నూల్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నానని ఆయన పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలో కోటి రూ॥లతో ఒక ఎకర స్థలంలో యాదవ భవన నిర్మాణానికి చర్యలు తీసుకుంటానని, మహిళలకు మహిళా సంఘం భవనాన్ని నిర్మించేందుకు రూ.5లక్షలు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు.

యాదవ కమ్యూనిటీ భవన ప్రారంభోత్సవానికి విచ్చేసిన ఎమ్మెల్యే మర్రి జనార్ధన్‌రెడ్డి, భైకాని శ్రీనివాస్‌యాదవ్‌లను యాదవ సోదరులు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికి శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పలువురు ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

## ఓపెన్ డిగ్రీలో అడ్మిషన్లకు జూలై 31 చివరి గడువు

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, జూలై 13 ప్రభాతవార్త:** అంబేద్కర్ ఓపెన్ డిగ్రీలో నాగర్‌కర్నూల్ లెర్నర్ సపోర్ట్ సెంటర్ (స్టడీ సెంటర్) నందు 2023-24 విద్యా సంవత్సరానికి గాను డిగ్రీ అడ్మిషన్ పొందుటకు జూలై 31 చివరి తేదీ అని ప్రభుత్వ డిగ్రీ కళాశాల అంబేద్కర్ ఓపెన్ డిగ్రీ సమన్వయ కర్త వర్కాల శ్రీనివాస్ తెలిపారు. కావున విద్యార్థులు ఇంటర్మీడియట్ లేదా ఓపెన్ ఇంటర్ లేదా ఏదైనా రెండు సంవత్సరాలు డిప్లమా కోర్సు పూర్తి చేసిన వారు లేదా ఓపెన్ ఇంటర్ లేదా ఏదైనా రెండు సంవత్సరాలు డిప్లమా కోర్సు పూర్తి చేసిన వారు లేదా ఐటీఐ, పాలిటెక్నిక్ కోర్సు పూర్తి చేసిన వారు అంబేద్కర్ సార్వత్రిక డిగ్రీలో అడ్మిషన్ పొందవచ్చునని తెలిపారు. కావున ఇట్టి అవకాశాన్ని అర్హత కలిగిన విద్యార్థులు సద్వినియోగం చేసుకొని జూలై 31వ తేదీ వరకు అడ్మిషన్ పొందాలని, మరిన్ని వివరాలకు నెల్లికొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాల నందు లేదా 7382929779 నెంబర్‌లో సంప్రదించవచ్చునన్నారు.



## ప్రజల జీవన ప్రమాణాల పెంపే లక్ష్యం...

**కల్వకుర్తి, జూలై 13 ప్రభాతవార్త:** ప్రజల జీవన ప్రమాణాల పెంపే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పథకాలు రూపొందించి అమలు చేస్తోందని ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. కల్వకుర్తి నియోజకవర్గం తలకొండపల్లి మండలం జంగారెడ్డి పల్లి గ్రామానికి చెందిన టి.నరేందర్‌కు మంజూరైన రూ.1 లక్ష సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి బాధిత కుటుంబ సభ్యులకు తన నివాసంలో గురువారం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పథకాల అమలులో తెలంగాణ దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. ప్రజారోగ్య పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరప్రదాయినిగా నిలుస్తోందన్నారు. ప్రమాదాల్లో గాయపడ్డవారు, అనారోగ్యాలతో బాధపడుతున్న వారు కార్పొరేట్ ఆసుపత్రుల్లో చికిత్సలు చేయించుకొని ఆర్థిక సహాయం కోసం సీఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేసుకునే అవకాశాన్ని సీఎం కల్పించారన్నారు. అదే విధంగా తలకొండపల్లి మండలం ఖానా పూర్ గ్రామానికి చెందిన చంద్రారెడ్డి వృద్ధాప్యంతో మృతి చెందడంతో విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి ఆయన మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో ఆయా మండలాల ప్రజా ప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## అట్టహాసంగా నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, జూలై 13 ప్రభాతవార్త:** లయన్స్‌క్లబ్ నాగర్‌కర్నూల్ 33వ అధ్యక్షులుగా రామకృష్ణారెడ్డి ఎన్నికయ్యారు. జిల్లా కేంద్రంలోని తిరుమల ఫంక్షన్ హాల్‌లో లయన్స్‌క్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్ కోటేశ్వర్‌రావు హాజరై నూతన కార్యవర్గంచే ప్రమాణ స్వీకారోత్సవం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో ఉన్న పేద వారికి స్వచ్ఛంద సంస్థలు సహకారం అందించి వారి అభివృద్ధికి పాటు పడాలని, అవగాహన శిబిరాలు, రక్తదాన శిబిరాలు, మొక్కల సంరక్షణ విధిగా చేయాలని సూచించారు. అధ్యక్షులుగా రామకృష్ణారెడ్డి, కార్యదర్శిగా అమరేందర్‌రెడ్డి, కోశాధికారిగా సాయి వీణలతో పాటు మిగతా కార్యవర్గ సభ్యులచే ప్రమాణ స్వీకారోత్సవం చేయించారు. కార్యక్రమంలో వైస్ గవర్నర్ మహేంద్రకుమార్‌రెడ్డి, మాజీ గవర్నర్ రాధకృష్ణ, రీజియన్ చైర్మన్ శ్రీనివాసులు, జోన్ చైర్మన్ గోవర్థన్, హాకీం విశ్వప్రసాద్, దొడ్ల ఈశ్వర్‌రెడ్డి, రాజవర్ధన్‌రెడ్డి, ప్రేమ్‌కుమార్‌రెడ్డి, సురేష్, జగ్గని, నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్, అచ్చంపేట, నారాయణపేట, హైదరాబాద్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.



## కెటిదొడ్డి విద్యార్థులకు ఉచిత బస్‌పాస్ పంపిణీ

**కెటిదొడ్డి, జూలై 13 ప్రభాతవార్త :** జోగులాంబ గద్వాల జిల్లా కెటిదొడ్డి మండల కేంద్రంలోని జడ్పీహెచ్‌ఎస్ నందిన్నె పాఠశాలలో గురువారం విద్యార్థులకు ఉచిత బస్‌పాస్ సౌకర్యాన్ని కల్పించారు. విద్యార్థినిలకు 10వ తరగతి వరకు ఉచిత బస్సు సౌకర్యం, అబ్బాయిలకు ఏడవ తరగతి వరకు ఉచిత బస్ సౌకర్యాన్ని కల్పించడం జరిగింది. ఈ సందర్భంతా విద్యార్థులు కెసిఆర్, ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేసి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జడ్పీటిసి రాజశేఖర్, కెటిదొడ్డి టిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు ఉరుకుంద, రైతు సమన్వయ అధ్యక్షుడు హనుమంతు, బిఆర్ఎస్ పార్టీ నాయకులు చక్రధర్‌రావు, రైస్ మిల్లు వీరన్న, రంగారెడ్డి, మైలగడ్డ శేఖర్, సప్లయర్ ఆంజనేయ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు మహేష్, ఆర్టీసి స్టేషన్ మేనేజర్ సంపత్‌రెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



## 12వసారి రక్తదానం చేసిన ప్రవీణ్‌కుమార్ గౌడ్

**మహబూబ్‌నగర్ బ్యూరో, జూలై 13, ప్రభాతవార్త :** దేవరకద్ర మండలం గుడిబండ గ్రామానికి చెందిన జ్యోతి అనే గర్భిణి డెలివరీ కోసం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ దవాఖానలో చేరింది. ఆమెను పరీక్షించిన వైద్యులు ఓ నెగెటివ్ రక్త అవసరం పడుతుందని చెప్పడంతో విషయం తెలుసుకున్న ప్రవీణ్‌గౌడ్ వెంటనే దవాఖానకు చేరుకొని రక్తదానం చేశారు. రక్తం అవసరం ఉందని తెలిసిన వెంటనే పెద్దదర్పల్లి గ్రామం నుంచి వచ్చి ప్రవీణ్ వెంటనే స్పందించి రక్తం అందించడంతో కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సహాయ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు శివప్రసాద్ మాట్లాడుతూ తమ ఫౌండేషన్ నుంచి ప్రవీణ్ 12వ సారి రక్తదానం చేసినట్లు తెలిపారు.



## గుండెపోటుతో పాఠశాల వాచ్‌మెన్ మృతి



**వెల్దండ, జూలై13 ప్రభాతవార్త:** మండలకేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో వాచ్‌మెన్‌గా విధులు నిర్వర్తిస్తున్న మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రానికి చెందిన సుధాకర్ గుండెపోటుతో మృతి చెందాడు. వాచ్‌మెన్ మృతికి ఉపాధ్యాయులు, విద్యార్థులు సంతాపం ప్రకటించి 2 నిముషాలు మౌనం పాటించారు.

## అభాగ్యులకు అండ... సీఎం రిలీఫ్ ఫండ్

**-ఎంపీ పోతుగంటి రాములు**

**కల్వకుర్తి, జూలై 13 ప్రభాతవార్త:** బడుగు, బలహీన వర్గాల ప్రజలు అనారోగ్యంతో, ప్రమాదవశాత్తు ప్రమాదానికి గురై వైద్యం చేయించుకోలేని నిస్సాహాయ స్థితిలో ఉండి ప్రాణాలు కోల్పోతున్న వారిని బ్రతికించాలనే ఆలోచనలతో రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు సీఎం రిలీఫ్ ఫండ్ పథకాన్ని ప్రవేశ పెట్టి అభాగ్యులకు అండగా నిలుస్తున్నారని నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సభ్యులు పోతుగంటి రాములు అన్నారు. గురువారం హైదరాబాద్‌లోని ఎంపీ నివాసంలో నియోజకవర్గంలోని పలువురికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను బాధిత లబ్ధిదారులకు అందించారు. కల్వకుర్తి మండలం లింగసానిపల్లి గ్రామానికి చెందిన బి.మహేష్‌కు మంజూరైన రూ.22వేలు, ఎల్లికల్ గ్రామానికి చెందిన ఎన్.రాఘవేందర్‌కు మంజూరైన రూ.21వేలు, వెల్దండ మండల కేంద్రానికి చెందిన వి.సురేందర్‌కు మంజూరైన రూ.16వేలు, చారకొండ మండలం శేరి అప్పారెడ్డిపల్లి గ్రామానికి చెందిన కె.శివలీలకు మంజూరైన రూ.23వేల చొప్పున మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పలు సంక్షేమ పథకాలను ప్రవేశ పెట్టి అట్టడుగు వర్గాల అభ్యున్నతి కోసం నిరంతరం కృషి చేస్తుందని ఆయన అన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ నాయకులు తదితరులు ఉన్నారు.



# మూడు గంటలు కావాలా.. మూడు పంటలు కావాలా..!

**- రేవంత్ రెడ్డి వ్యాఖ్యలకు నిరసనగా జడ్చర్లలో ఆందోళన**

**- రైతు వ్యతిరేఖ విధానాలు**

**అవలంబిస్తున్న కాంగ్రెస్: ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి**

**మహబూబ్‌నగర్ బ్యూరో, జూలై 13, ప్రభాతవార్త :** రైతు వ్యతిరేఖ విధానాలను అవలంబిస్తున్న కాంగ్రెస్ కావాలా...రైతు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న బీఆర్ఎస్ కావాలా, మూడు గంటలు కరెంట్ ఇచ్చిన సర్కార్ కావాలా, మూడు పంటలకు కరెంట్ ఇచ్చే సర్కార్ కావాలో రైతులు ఆలోచించాలని ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి కోరారు. 24 గంటల ఉచిత కరెంట్‌పై టీపీసీసీ రేవంత్ రెడ్డి అమెరికాలో చేసిన వ్యాఖ్యలకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ పిలుపు మేరకు జడ్చర్ల నియోజకవర్గ కేంద్రంలో చేపట్టిన నిరసనలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. వ్యవసాయంపై అవగాహన లేకుండా టీపీసీసీ అధ్యక్షుడు రైతులకు 24గంటల కరెంట్ అవసరం లేదు అనడంపై ఎమ్మెల్యే దుయ్యబట్టారు. ఎకరాలకు గంట కరెంట్ చాలు అనడం, మూడు గంటల కరెంట్ సరిపోతుందని ఇది వారి విధానమని, తాము అధికారంలోకి వస్తే మూడు గంటలే విద్యుత్ అందిస్తామని చెప్పకనే చెబుతున్నారని, టీపీసీసీ అధ్యక్షుడు చేత అలా మాట్లాడించారని చెప్పారు. రేవంత్ రెడ్డి డౌన్‌డౌన్, రైతు వ్యతిరేఖ కాంగ్రెస్ డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు.

కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ కోడ్గల్ యాదయ్య, మున్సిపల్ చైర్‌పర్సన్ దోరెపల్లి లక్ష్మీరవీందర్, వైస్ చైర్‌పర్సన్ సారి కారామ్మోహన్, మార్కెట్ కమిటీ చైర్మన్ మన్యం గోవర్ధన్‌రెడ్డి, సర్పంచుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రణీల్‌చందర్, పీఏసీసీఎస్ చైర్మన్ సుదర్శన్‌గౌడ్, కౌన్సిలర్లు కోట్ల ప్రశాంత్‌రెడ్డి, సతీశ్, నందకిషోర్‌గౌడ్, ఉమాశంకర్‌గౌడ్, శశికిరణ్, లత, ఉమాదేవి, చైతన్య చౌహాన్, ముడా డైరెక్టర్లు శ్రీకాంత్, శ్రీశైలం యాదవ్, నాయకులు రామ్మోహన్, సుదర్శన్, నాగిరెడ్డి, దామోదర్, సాయి, అంజి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పిట్టలమురళీ, ఎంఈవో మంజులాదేవి, ముడా డైరెక్టర్లు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.



జడ్చర్లలో నిరసన తెలుపుతున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, నాయకులు, రైతులు

# రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలు సమంజసం కావు...

**వెల్దండ, జూలై 13 ప్రభాతవార్త:** టీపీపీసీసీ అధ్యక్షులు రేవంత్‌రెడ్డి రైతుల పక్షాన చేసిన వ్యాఖ్యలు సమంజసం కావని, ఆ వ్యాఖ్యలు కాంగ్రెస్ పార్టీకి ఉన్న చిత్తశుద్ధి తెలియజేస్తుందని జెడ్పీటీసీ ధ్యాప విజితారెడ్డి, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు, వెల్దండ గ్రామ సర్పంచ్ యెన్నం భూపతిరెడ్డిలు అన్నారు. వెల్దండ మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దగ్దం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతుల మీద అవగాహన లోపంతో రాష్ట్ర రైతాంగాన్ని అవమానపర్చే విధంగా రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలు ఉన్నాయని, బీఆర్ఎస్ పార్టీ 24 గంటల ఉచిత విద్యుత్ అందిస్తే...కాంగ్రెస్ వస్తే 3గంటలు కరెంట్ ఇస్తామని చెప్పడం వారి అవివేకానికి నిదర్శనమన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని అనేక సంక్షేమ పథకాలు చేపడుతుందన్నారు. కాంగ్రెస్ పార్టీ కపట బుద్దిని కనబరుస్తుందన్నారు. రైతుల జోలికి వస్తే ఖబడ్దార్ అని, రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు భాస్కర్‌రావు, క్యాసారపు వెంకటయ్య, ఎంపీటీసీలు గుత్తి వెంకటయ్య, రాములు, జ్యోతినిరంజన్, సర్పంచ్‌లు పత్యానాయక్, కుమార్, నాయకులు జైపాల్‌నాయక్, గోపాల్‌నాయక్, రవినాయక్, మల్లయ్య, నిరంజ న్‌గౌడ్, అలీ, రాజునాయక్, నర్సింహ్మ ముదిరాజ్, తిర్మల్‌రావు, రవిగౌడ్, సమీర్ అహ్మెద్ షేక్, వెంకటేష్ ముదిరాజ్, శ్రీనునాయక్, జంగిలి యాదగిరి, ప్రసాద్, కాదూరాంతో పాటు తదితరులు ఉన్నారు.



రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దగ్దం చేస్తున్న దృశ్యం

**రోడెక్కిన అధికార పార్టీ నాయకులు..**

**రేవంత్ దిష్టిబొమ్మ దగ్దం....**

**అచ్చంపేట, జూలై 13 ప్రభాతవార్త:** టీపీసీసీ అధ్యక్షులు రేవంత్‌రెడ్డి ఉచిత విద్యుత్‌పై చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ అచ్చంపేట నియోజకవర్గ కేంద్రంతో పాటు పలు మండల కేంద్రాల్లో బీఆర్ఎస్ శ్రేణులు రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దగ్దం చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ రైతు ద్రోహి రేవంత్ అంటూ నినాదాలు చేస్తూ రైతులకు 24గంటల ఉచిత విద్యుత్‌ను అందిస్తూ వ్యవసాయాభివృద్ధికి తోడ్పడుతుంటే పీసీసీ అధ్యక్షులు మాత్రం రైతులను కించపరిచేలా 24 గంటల విద్యుత్ సరఫరా అవసరం లేదని, 3 గంటలు మాత్రమే సరిపోతుందని రైతులు హేళన చేసి మాట్లాడిన మాటలకు యావత్ తెలంగాణ రైతాంగానికి క్షమాపణ చెప్పాలని, బీఆర్ఎస్ శ్రేణులు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆయా గ్రామాలకు చెందిన నాయకులు పాల్గొన్నారు.




వంగూరులో రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దగ్దం చేస్తున్న నాయకులు

# బీఆర్ఎస్ పాలనలోనే గ్రామాలకు మహార్ధశ..

**-సీఎం కేసీఆర్ త్యాగ పురుషుడు -పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే**

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, జూలై 13, ప్రభాతవార్త:** బీఆర్ఎస్ పాలనలోనే గ్రామాలకు మహార్ధశ చేకూరుతుందని ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రం నుంచి నెల్గొండ గ్రామం వరకు రూ.40లక్షల నిధులతో చేపట్టనున్న బీటీ రోడ్డు పనులకు, బిజినపల్లి మండలంలో వట్టెం నుంచి వెల్గొండ వరకు కొత్తగా బీటీ రోడ్డు నిర్మాణానికి రూ.3కోట్ల 20లక్షలతో, వట్టెం గ్రామంలో రూ.68లక్షలతో ఆర్‌అండ్‌బీ అతిథి గృహం, వెల్గొండ గ్రామంలో రూ.20లక్షల నిధులతో గ్రామ పంచాయతీ భవన నిర్మాణాలకు ఎమ్మెల్యే మర్రి జనార్ధన్‌రెడ్డి భూమి పూజ శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ 2001 నుంచి 2014 వరకు కేసీఆర్ తెలంగాణ ఉద్యమం చేసి పార్లమెంట్‌లో బిల్లు ప్రవేశ పెట్టించి తెలంగాణను సాధించిన మహాపురుషుడు సీఎం కేసీఆర్ అని కొనియాడారు. రాష్ట్రంలో ప్రజల అవసరాలను తీర్చే ప్రభుత్వం బీఆర్ఎస్ అని, సబ్బండ వర్గాల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తుందన్నారు. దేశంలో ఎక్కడ ప్రవేశ పెట్టని సంక్షేమ పథకాలు తెలంగాణ రాష్ట్రంలో సీఎం కేసీఆర్ ప్రవేశ పెట్టి గడప గడపకు సంక్షేమ పథకాలు అందిస్తున్నారు. రైతన్న సంక్షేమం కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టి రైతుబంధు, రైతు భీమా, సకాలంలో ఎరువులు, ఉచిత విద్యుత్‌తో పాటు రైతు వేదికల నిర్మాణం చేపడుతూ దేశ చరిత్రలో రైతు సంక్షేమం కోసం కృషి చేస్తున్నారన్నారు. తాగునీటికి ఇబ్బంది కలుగకూడదనే ఉద్దేశంతో మిషన్ భగీరథ పథకం చేపట్టి ఇంటింటికి తాగునీరు అందిస్తూ కృష్ణా, గోదావరిలను ఏకం చేస్తూ ప్రతి గుంటకు, ప్రతి ఎకరాకు సాగునీరు అందిస్తున్నామన్నారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్దే ధ్యేయంగా పల్లె ప్రగతి కార్యక్రమం ద్వారా పల్లెలు పట్టణాలను తలపించే విధంగా ప్రకృతి వనాలు, హిందు వైకుంఠదామాలు, వర్మి కంపోస్ట్ షెడ్లు, రైతు వేదికలతో పాటు గ్రామాలను సర్వంగా సుందరంగా తీర్చిదిద్దుకోవడం జరిగిందన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు తదితరులు ఉన్నారు.



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న దృశ్యం

# ఇంగ్లీష్ టీచర్ లేని వీపనగండ్ల బాలికల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల..

**- ఇంగ్లీష్ మీడియం స్కూల్లో ఇంగ్లీష్ టీచర్ లేరు**

**- ఉన్న ఇంగ్లీష్ టీచర్‌ను డిప్యూటేషన్‌పై**

**పంపంచడంతో అంతర్యం ఏమిటీ**

**- విద్యార్థుల తల్లిదండ్రుల ఆరోపణ**

**వీపనగండ్ల, జూలై13, ప్రభాతవార్త:** వీపనగండ్ల మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ఈనెల 10వ తేదీ నుండి ఇంగ్లీష్ సబ్జెక్టు బోధించడానికి ఉపాధ్యాయులు ఎవరు లేరని విద్యార్థులు విద్యార్థి తల్లిదండ్రులు తెలిపారు. ఈవిషయంపై ప్రధానోపాధ్యాయులు మంజులను వివరణ కోరగా మా స్కూలుకు గౌసియా బేగం ఇంగ్లీష్ ఉపాధ్యాయురాలు ఉన్నారని, కానీ నాకు ఎలాంటి ఆధారపూరిత సమాచారం లేకుండానే ఎంఈవో లక్ష్మణ్ నాయక్ ఇంగ్లీష్ ఉపాధ్యాయురాలిని డిప్యూటేషన్‌పై పంపించారని తెలిసింది. ఈ విషయంపై నేను ఇంగ్లీష్ ఉపాధ్యాయురాలికి ఫోన్ చేసిన తరువాత నాకు తెలిసిందని వారన్నారు. ఈ విషయంపై ఎంఈవో లక్ష్మణ్ నాయక్‌ని సంప్రదించగా వారు మాట్లాడుతూ... ఉన్నత పాఠశాల అంశాలు నా పరిధిలోకి రావని అన్నారు. డీఈవో ఆదేశాల మేరకు నేను సీఆర్‌పి వెంకటేష్‌కి ఇంగ్లీష్ ఉపాధ్యాయురాలిని డిప్యూటేషన్‌పై వనపర్తి పంపించామని ఇది డీఈవో చెప్పినట్లు చేశానని, ఇది నా పరిధిలోకి రాదని ఎంఈవో లక్ష్మణ్ నాయక్ తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులు మాట్లాడుతూ... తెలంగాణ ప్రభుత్వం ఆంగ్ల మాధ్యమాన్ని ప్రోత్సహిస్తు ప్రభుత్వ పాఠశాలలో ఆంగ్ల మాధ్యమం ఏర్పాటు చేసిందని అలాంటి ఆంగ్లం బోధించడానికి ఉన్న ఉపాధ్యాయురాలిని డిప్యూటేషన్ పేరుతో పంపించడం ఎంత వరకు సమంజసం అని తల్లిదండ్రులు అంటున్నారు. అధికారులు మా పిల్లల భవిష్యత్తుపై ఆడుకోవదనదని వెంటనే డిప్యూటేషన్‌పై వెళ్లిన ఉపాధ్యాయురాలిని నియమించాలని లేదా వేరే ఉపాధ్యాయులను నియమించాలని లేకపోతే పాఠశాల యందు ధర్నా నిర్వహిస్తామని తెలిపారు. పాఠశాలలో ఉన్న ఇంగ్లీష్ ఉపాధ్యాయురాలిని వనపర్తి హరిజనవాడ పాఠశాలకు డిప్యూటేషన్‌పై పంపించాల్సిన అవసరం ఏముందని గ్రామ ప్రజలు, విద్యార్థుల తల్లిదండ్రులు అంటున్నారు.




వీపనగండ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల

# ఈనెల 16న బీజేపీ నియోజకవర్గ ఇష్టా గోష్టి కార్యక్రమం..

**- బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజవర్ధన్‌రెడ్డి**

**వనపర్తి టౌన్, జూలై13, ప్రభాతవార్త:** ఈనెల 16వ తేదీన బీజేపీ వనపర్తి నియోజకవర్గ ఇష్టాగోష్టి కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజవర్ధన్‌రెడ్డి అన్నారు. బీజేపీ జిల్లా కోర్ కమిటీ సమావేశాన్ని గురువారం జిల్లా అధ్యక్షుడు రాజవర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో నాగవరంలో నిర్వహించారు. కోర్ కమిటీ సమావేశానికి ముఖ్య అతిథిగా బీజేపీ జిల్లా ఇం చార్జీ బోసుపల్లి ప్రతాప్ మాట్లాడుతూ... బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కేంద్రమంత్రి కిషన్ రెడ్డి అధ్యక్ష తన జరిగిన రాష్ట్ర పదాధికారుల సమావేశంలో బీజేపీ 100 రోజుల ప్రణాళికలో తీసుకున్న కార్యక్రమాలలో భాగంగా తెలంగాణలోని 119 అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రాలలో ఈనెల 16న టిఫిన్ డబ్బా ఇష్టా గోష్టి కార్యక్రమం నిర్వహించాలని తీసుకున్న నిర్ణయంలో భాగంగా వనపర్తి నియోజకవర్గ టిఫిన్ డబ్బా ఇష్టా గోష్టి కార్యక్రమాన్ని చిట్యాల గ్రామ శివారులోని నూతన మార్కెట్ యార్డు సమీపంలో గల దామోదర్ తోటలో నిర్వహించడం జరుగు తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని అన్ని మండల పదాధికారులు ఆ పై స్థాయి బాధ్యతలు కలిగిన నాయ కులు పాల్గొని మండలాల వారీగా నిర్వహించే కార్యక్రమాలకు రూపకల్పన చేసుకోవడం, కార్యక్రమాల నిర్వహణకు యోజన చేసుకో వడం జరుగుతుందని , ఈకార్యక్రమంలో పాల్గొనే ప్రతి నాయకుడు కూడా తమ ఇంటి నుండే శాఖాహార టిఫిన్ , తాగునీరు తెచ్చుకోవాలని సూచించారు. సమావేశంలో స్టేజీలు, మైకులు, ఉపన్యాసాలు ఉండవని, నియోజకవర్గంలో అన్ని మండల పదాధికా రులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో బీజేపీ సీనియర్ నాయకులు మాజీ ఎమ్మెల్యే డాక్టర్ రావుల రవీంద్రనాథ్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి.కృష్ణ, జిల్లా ప్రధాన కార్యదర్శి దుప్పల్లి నారాయణ, కొత్త కాపు మాధవరెడ్డి, అక్కల రామన్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

## సీఐ సోమ నర్సయ్యకు సన్మానం..

**వెల్దండ, జూలై 13 ప్రభాతవార్త:** నూతనంగా వెల్దండ మండల సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన జె.సోమ నర్సయ్యను వెల్దండ మండల ప్రజా ప్రతినిధులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు శాలువాలతో ఘనంగా సన్మానించారు. సన్మానించిన వారిలో ఎంపీటీసీ గుత్తి వెంకటయ్య, నీరటి రాములు, నాయకులు జయపాల్‌నాయక్, గోపాల్ నాయక్, సర్పంచ్‌లు పత్యానాయక్, దశరథ్‌నాయక్, నర్సింహ్మ ముదిరాజ్, పర్వతాలు, రవిగౌడ్‌తో పాటు తదితరులు ఉన్నారు.



## 5వ రోజు అనిరుధ్‌రెడ్డి పాదయాత్ర..

**నవాబ్‌పేట, జూలై 13 ప్రభాతవార్త :** నవాబ్‌పేట మండలంలోని పోమాల్ నుండి కేశవరావువల్లి గ్రామానికి విచ్చేసిన టిపిసిసి ప్రధాన కార్యదర్శి జనంపల్లి అనిరుధ్‌రెడ్డి పాదయాత్ర 5వ రోజు కొనసాగింది. ఈ సందర్భంగా ఆయనకు ప్రజలు తరలివచ్చి ఘన స్వాగతం పలికారు. పండుగ సాయన్న విగ్రహానికి అనిరుధ్‌రెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే నిరుద్యోగులకు 2లక్షల ఉద్యోగాలు ఒకేసారి భర్తీ చేస్తామని తెలిపారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.



## కళ్లకు నల్లగుడ్డలు కట్టుకుని నిరసన



**ఉట్కూర్, జూలై13 ప్రభాతవార్త:** మండలకేంద్రంలో 8వ రోజు ఎంపిడిఓ కార్యాలయం ముందు గ్రామపంచాయతీ కార్మికులు నిరవధికసమ్మె కొనసాగించారు. 8వరోజుకు చేరిన సమ్మెలో గురువారం పంచాయతీ కార్మికులు కళ్లకు నల్ల గుడ్డలు కట్టుకుని నిరసన తెలిపారు. కార్యక్రమంలో గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లాకార్యదర్శి సుశాంత్, మండల అధ్యక్షులు డి.హన్మంతు, నారాయణ, పోలమ్మ, ఉదయ్, కనకప్ప, డి.శంకర్, సత్యం, నగేష్, మార్కండేయ తదితరులు ఉన్నారు.

## ఇండ్ల స్థలాలకై జర్నలిస్టులు ఎమ్మెల్యేకు వినతి...



**కల్వకుర్తి, జూలై 13 ప్రభాతవార్త:** కల్వకుర్తి ప్రాంతంలో వర్కింగ్ జర్నలిస్టుగా పనిచేస్తున్న వారందరికి ఇండ్ల స్థలాలు కేటాయించాలని కోరుతూ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్‌కు వినతి పత్రం అందించారు. గురువారం కల్వకుర్తి ప్రింట్ మీడియా అసోసియేషన్ అధ్యక్షులు వెంకటయ్య ఆధ్వర్యంలో వినతి పత్రం అందించారు. జర్నలిస్టులకు నిరంతరం అందుబాటులో ఉంటూ వారి సమస్యలను పరిష్కరిస్తానని ఎమ్మెల్యే పేర్కొన్నారు. వినతిని స్వీకరించిన అనంతరం సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే వెంటనే తహసీల్దార్‌తో మాట్లాడి ఇండ్ల స్థలాలకై చర్యలు చేపట్టాలని సూచించారు. త్వరలోనే స్థల పరిశీలన చేసి అర్హులైన వారందరికి ఇండ్ల స్థలాలు కేటాయిస్తామని ఎమ్మెల్యే తెలిపారు. వినతి పత్రం అందజేసిన వారిలో శ్రీనివాస్‌రెడ్డి, కార్తీక్, శ్రీధర్, రామచందర్, శ్రీను, రాజన్న, ఫయాజ్, సురేష్, మజీద్, నాగేష్, కృష్ణయ్య, శేఖర్‌గౌడ్, సంఘం సభ్యులు తదితరులు ఉన్నారు.

# గడప గడపకు బీఆర్ఎస్ సంక్షేమ పథకాలు



31వ వార్డులో సంక్షేమ పథకాలను వివరిస్తున్న బీఆర్ఎస్ నాయకులు



21వ వార్డులో సంక్షేమ పథకాలను వివరిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

**వనపర్తి టౌన్, జూలై13, ప్రభాతవార్త:** రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి వనపర్తి పట్టణానికి చేసిన అభివృద్ధి పనులు గురించి బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు, జిల్లా అధ్యక్షుడు,మున్సిపల్ చైర్మన్ గట్టు యాదవ్ ఆధ్వర్యంలో పట్టణంలోని 21వార్డులో ఇంటింటికి తిరుగుతూ గడప గడపకు బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన సంక్షేమ,అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. 21వ వార్డులోని నందిమల్ల గడ్డ, మేఘ్య తండా, హరిజనవాడ వీధిలో ఇంటింటికి తిరుగుతూ ఈదుల చెరువు నుండి నందిమల్ల గడ్డకు మేఘ్యా తాండకు పైపులైన్ ద్వారా రైతులకు పంటలు పండించుకునేందుకు మోటార్ల ద్వారా నీటిని సప్లయ్ చేయించి, రైతులకు మేలు చేసిన ఘనత రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డికే దక్కుతుందని వారు వార్డు ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ గట్టు యాదవ్, మార్కెట్ కమిటీ చైర్మన్, పట్టణ టీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు పలుస రమేష్ గౌడ్, మున్సిపల్ వైస్ చైర్మన్‌వాకిటి శ్రీధర్, పట్టణ ఇంచార్జ్ అరుణ్ ప్రకాష్, కౌన్సిలర్ లక్ష్మి నారాయణ, కంచరవి, గంధం శరవంద, బండారు కృష్ణ, నందిమల్ల శ్యాం, స్టార్ రహీం, పాకనాటి కృష్ణ, గోపాల్ యాదవ్, కోఆప్షన్ సభ్యులు గులాం ఖాదర్ ఖాన్, ఇమ్రాన్ 21వ వార్డు ఇంచార్జ్ గంధం విజయ్ కుమార్, టీఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి మార్కెట్ కమిటీ డైరెక్టర్ గంధం పరంజ్యోతి, మాజీ కౌన్సిలర్ చీర్ల కేశవులు, హెచ్ఎన్ కుమార్, సునీల్, వాల్మీకి నక్కమహేష్,రామకృష్ణ,మహిళా నాయకురాలునాగనమోని నాగమ్మ, కొమ్ము లక్ష్మి రాధా, మాధవి, జమ్ములమ్మ, శ్రీనివాసులు, రఘు, బంగాలే జోయబ్, 21వ వార్డు అధ్యక్షుడు తిరుపతయ్య, గంధం బాలరాజు, జీవి, ప్రశాంత్ మన్యం, వీరప్ప, నందిమల్ల ఆంజనేయులు, చంద్రయ్య, నందిమల్ల సవారయ్య తదితరులు పాల్గొన్నారు.

**31వ వార్డులో:** రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి ఎమ్మెల్యేగా గెలిచిన తరువాత వనపర్తి నియోజకవర్గానికి చేసిన అభివృద్ధి పనులపై ఇంటింటికి తిరుగుతూ బీఆర్ఎస్ నాయకులు ప్రజలకు వివరించారు. ఎన్నడు లేని విధంగా మంత్రి నిరంజన్ రెడ్డి సారథ్యంలో వనపర్తి నియోజకవర్గం అన్ని రంగాలలో అభివృద్ధిలో ముందుకు దూసుకెళ్తుందని ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో వనపర్తి జిల్లా అధ్యక్షులు మున్సిపల్ చైర్మన్ గట్టు యాదవ్, వైస్ చైర్మన్ వాకిటి శ్రీధర్, పట్టణ అధ్యక్షుడు మార్కెట్ కమిటీ చైర్మన్ రమేష్ గౌడ్, పట్టణ ఇంచార్జ్ ప్రకాష్, 31వ వార్డు బిఆర్ఎస్ ఇంచార్జ్ జహంగీర్,ప్రధాన కార్యదర్శులు పరంజ్యోతి, ఆవుల రమేష్, పట్టణ మహిళాఅధ్యక్షురాలు నాగమ్మ, వార్డుఅధ్యక్షులు వినోద్,మహిళా అధ్యక్షురాలు నర్సీన్ బేగం, ప్రధాన కార్యదర్శి భాగ్యమ్మ, యూత్ అధ్యక్షులు యశ్వంత్, ప్రధానకార్యదర్శి మహేష్,వార్డు కార్యకర్తలు ఖాజా, శ్రీనివాసులు, లలితమ్మ తదితరులు పాల్గొన్నారు.

## రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం



రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

**వనపర్తి టౌన్,జూలై13,ప్రభాతవార్త:** 24 గంటల ఉచిత విద్యుత్ పథకాన్ని వ్యంగ్యంగా మాట్లాడిన రేవంత్‌రెడ్డి మాటలకు నిరసనగా జిల్లా కేంద్రంలోని సబ్ స్టేషన్ ఎదురుగా మున్సిపల్ చైర్మన్ గట్టు యాదవ్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా నినాదాలు చేస్తు కాంగ్రెస్ పార్టీ రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీ చైర్మన్ లోక్‌నాథ్‌రెడ్డి, జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు, మున్సిపల్ చైర్మన్ గట్టు యాదవ్, మార్కెట్ కమిటీ చైర్మన్, పట్టణ పార్టీ అధ్యక్షుడు రమేష్ గౌడ్, వనపర్తి మున్సిపల్ వైస్ చైర్మన్ వాకిటి శ్రీధర్, మండల పార్టీ అధ్యక్షుడు మాణిక్యం,సింగిల్‌విండోఅధ్యక్షులు,కౌన్సిలర్లు,పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.



రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

**శ్రీరంగాపురం,జూలై13,ప్రభాతవార్త:** టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి స్వయంగా ఓ సమావేశంలో రైతులకు ఉచిత కరెంటు ఎందుకు ఇవ్వాలంటూ ఎదురు ప్రశ్నించారు. 95 శాతం మంది రైతులు మూడు ఎకరాల్లోపే ఉన్నారని, వారికి 8 గంటల కరెంటు ఇస్తే చాలని చేసిన వ్యాఖ్యలు రైతన్నలలో తీవ్ర దుమారాన్ని రేపుతున్నాయి. రేవంత్‌రెడ్డి చేసిన ప్రకటన నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ రైతు వ్యతిరేక ఆలోచనా విధానానికి వ్యతిరేకంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి పిలుపు మేరకు గురువారం మండల కేంద్రంలో సబ్ స్టేషన్ ముందు ఎంపీపీ గాయత్రి పృద్వీరాజ్, సర్పంచ్ వినీలరాణి కురుమయ్య, మండల అధ్యక్షుడు వెంకటస్వామి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నిరసన చేపట్టారు. వారు మాట్లాడుతూ... అధికారం కోసం పాకులాడుతూ బీఆర్ఎస్‌ను ఢీకొనే సత్తా లేక ప్రభుత్వంపై లేనిపోని అభాండాలను వేస్తున్నారు. రాష్ట్రం అభివృద్ధి పథంలో దూసుకుపోతుందంటే అందుకు సీఎం కేసీఆర్ ముందుచూపే కారణమని గులాబీ పార్టీ నేతలు అన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ మళ్లీ చీకటి రాజ్యం తీసుకురావాలని ప్రయత్నిస్తోంది. దేశంలో ఏ రాష్ట్ర ప్రభుత్వం చేయని సాహసం చేసి రైతులకు 24 గంటల ఉచిత కరెంటు ఇస్తుంటే కాంగ్రెస్‌కు కండ్లు మండుతున్నాయి.రైతులు బాగుపడుతుంటే ఇష్టం లేని కాంగ్రెస్ నేతలు మళ్లీ కరెంటు కష్టాలు తీసుకురావాలని చూస్తున్నారని, ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఆ పార్టీ నాయకుల కుటిల బుద్ధి ఒక్కొక్కటి బయటపడుతుందన్నారు. ఉమ్మడి రాష్ట్రంలోని కాంగ్రెస్ పాలనలో కరెంటు కోసం లాఠీ దెబ్బలు తిన్న విషయాన్ని గుర్తు చేశారు. పొద్దున మూడు గంటలు, రాత్రి మూడు గంటలు కరెంటు ఇచ్చి రైతులను పొలాలవద్ద జాగారం చేయించిన రోజులు రైతన్నలు మరిచిపోలేదని గుర్తు చేస్తున్నామన్నారు. సబ్ స్టేషన్ ముందు రేవంత్‌రెడ్డి దిష్టబొమ్మను దగ్ధం చేశారు. రైతులకు మూడు గంటల కరెంటు చాలన్న కాంగ్రెస్ పార్టీ ఖబడ్దార్ రేవంత్‌రెడ్డి అని రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీకి వచ్చే ఎలక్షన్స్‌లో బుద్ధి చెబుతామని రాష్ట్రంలోకాంగ్రెస్ పార్టీకి అవకాశం ఇస్తే రైతులనుమోసం చేస్తుందని మళ్లీ తెలంగాణ 60ఏళ్లు వెనక్కి వెళ్లాల్సి వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మండలరైతు సమన్వయ అధ్యక్షుడు గౌడ నాయక్, బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు మహేష్‌గౌడ్, కంబాలాపురం సర్పంచ్ ఎద్దుల మంజుల రాజవర్ధన్‌రెడ్డి, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు కేశపాగ శ్రీనివాసులు, బీఆర్ఎస్ నాయకులు డాక్టర్ కురుమన్న,జావిద్,గాజుల శివశంకర్, బొల్లెద్దుల కృష్ణయ్య, సుదర్శన్ రెడ్డి, రైతన్నలు తదితరులు పాల్గొన్నారు.

## నేడు ఘనంగా యువ ఉత్సవం

**వనపర్తి,జూలై13,ప్రభాతవార్త:** భారత ప్రభుత్వం యువజన సర్వీసులు క్రీడల మంత్రిత్వ శాఖ వారి ఆధ్వర్యంలో నెహ్రూ యువ కేంద్రం సౌజన్యంతో జిల్లాస్థాయిలో యువజన ఉత్సవం స్థానిక బుద్దారం టీఎస్‌డబ్ల్యూఆర్ఎస్ మహిళా కళాశాల గోపాల్‌పేట మండలం వనపర్తి జిల్లాలో ఘనంగా నిర్వహించడం జరుగుతుందని, దీని ముఖ్య ఉద్దేశ్యం భారతదేశం స్వాతంత్ర్యం కోసం అనేక పోరాటాలతో ప్రాణ త్యాగాలతో స్వాతంత్ర్యం సంపాదించి 75 సం.లు పురస్కరించుకుని ఆజాదికా అమృత్ మహోత్సవం సందర్భంగా ఈ ఉత్సవాలు భారతదేశం అంతటా జిల్లా స్థాయిలో నెహ్రూ యువ కేంద్రం భారత ప్రభుత్వ ఆదేశానుసారం నిర్వహించడం జరుగుతుందని దీనిలో భాగంగా వివిధ కళాశాలలోని యువకులలో దాగి ఉన్న ప్రతిభను గుర్తించి వారిని జిల్లాస్థాయి నుండి రాష్ట్రస్థాయి ఎంపిక చేసి వారిని ప్రోత్సహక బహుమతి, తెలివితేటలను గుర్తించి వారి ప్రతిభను చాటడానికి ఈ యువజన ఉత్సవం పాటుపడుతుందని జిల్లా యువజన అధికారి కోటా నాయక్ తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, జడ్పీ చైర్మన్ లోక్‌నాథ్ రెడ్డి హాజరు కానున్నారని తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లాస్థాయిలో యువతీ యువకులు పాల్గొని విజయవంతం చేయాలనిఆయన పిలుపునిచ్చారు. మర్ని వివరాలకు 99498 19207 నంబర్‌ను సంప్రదించాలని తెలిపారు.



యువజన ఉత్సవం పోస్టర్ ఆవిష్కరిస్తున్న జిల్లా కలెక్టర్

# తెలంగాణ ప్రభుత్వం రైతుల ప్రభుత్వం

**- ఎంపీటీసీ భాస్కర్ రెడ్డి, ఎంపీపీ కమలేశ్వర్ రావు - రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలకు నిరసనగా బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో సబ్ స్టేషన్ ఎదుట ధర్నా**

**వీపనగండ్ల,జూలై13,ప్రభాతవార్త:** వీపనగండ్ల మండల కేంద్రంలో సబ్ స్టేషన్ ఎదుట వీపనగండ్ల బీఆర్ఎస్ పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి రైతులకు మూడు గంటలే కరెంటు సరిపోతుందని మాట్లాడడం రైతులను కించపరిచే విధంగా ఉన్నాయని వీపనగండ్ల ఎంపీపీ కమలేశ్వర్ రావు అన్నారు. ఎంపీటీసీ భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ... ఒకప్పుడు తెలంగాణలో రైతులు రాత్రిపూట బావి మోటార్ల దగ్గరికి వెళ్లి ఎప్పుడు కరెంటు వస్తుందోనని ఎదురు చూసే వాళ్లని, కరెంటు ఇబ్బందితో ఎన్నో మోటర్లు కాలిపోయాయని దీంతో రైతులకు చాలా ఇబ్బంది ఉండేదని అలాంటిది ఇప్పుడు తెలంగాణ ఏర్పడిన తరువాత రైతులకు ఎలాంటి సమస్యలు రాకూడదనే ఉద్దేశ్యంతో రైతులకు 24 గంటల కరెంటు ఇస్తున్న ఏకైక ప్రభుత్వం మన బీఆర్ఎస్ రాష్ట్ర ప్రభుత్వమని అన్నారు. రైతులకు మూడు గంటలు కరెంటు సరిపోతుందన్న వ్యాఖ్యలను రేవంత్‌రెడ్డి వెనక్కి తీసుకోవాలని, రైతులకు క్షమాపణ చెప్పాలని రేవంత్‌రెడ్డిని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో టీఆర్ఎస్‌పార్టీ మండలఅధ్యక్షుడు సత్య నారాయణగౌడ్, వీపనగండ్ల ఎంపీటీసీ భాస్కర్‌రెడ్డి, సర్పంచ్ రామేశ్వర్ రావు, సింగిల్‌విండో డైరెక్టర్ వెంకటయ్య, భాస్కర్ నాయక్, మార్కెట్ డైరెక్టర్ సాయిబాబా, బిఆర్ఎస్‌పార్టీసీనియర్ నాయకులు మల్లయ్య యాదవ్, కరుణాకర్‌రెడ్డి, సురేష్‌రెడ్డి, మహేష్‌రెడ్డి, శేఖర్‌గౌడ్, కురుమయ్య, వెంకటయ్య, బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.



వీపనగండ్ల మండల సబ్ స్టేషన్ ఎదుట ధర్నా చేస్తున్న బీఆర్ఎస్ మండల పార్టీ నాయకులు

# ముగిసిన క్రీడా పాఠశాలల ఎంపికలు

**వనపర్తి,జూలై13,ప్రభాతవార్త:** జిల్లా కేంద్రంలోని డాక్టర్ బాలకిష్టయ్య క్రీడా ప్రాంగణంలో 4వ,5వ తరగతి చదివే విద్యార్థిని విద్యార్థులకు క్రీడా పాఠశాలల ప్రవేశాల కొరకు గురువారం ఎంపికలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మున్సిపల్ చైర్మన్ గట్టు యాదవ్ హాజరై మాట్లాడుతూ... ఎంపికలో ప్రతిభకను కనబరిచి రాష్ట్రస్థాయిలో జరిగే ఎంపికలో పాల్గొని మన జిల్లా నుండి ఎక్కువ మంది క్రీడాకారులు ఎంపికైన మన జిల్లాకు పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని ఆయన క్రీడాకారులను ఆశీర్వదించారు. ఈ ఎంపికలకు 4వ తరగతి నుండి 35 మంది బాలురు, 20 మంది బాలికలు, 5వ తరగతి నుండి 50 మంది బాలురు, 20 మంది బాలికలు పాల్గొన్నారు. 85 మంది బాలురు, 40 మంది బాలికలు ,మొత్తం 125 మంది ఎంపికలలో పాల్గొన్నారు. ఎత్తు , బరువు, స్టాండింగ్ వర్టికల్ జంప్, ఫ్లెక్సిబిలిటీ టెస్టు, 30 మీటర్ల ఫ్లయింగ్ స్టార్ట్,6/10 మీటర్ల షటిల్ రన్, మెడిసిన్ బాల్ త్రో స్టాండింగ్ బ్రాడ్ జంప్,800 మీటర్స్ రన్ అంశాలలో పరీక్షలు నిర్వహించడం జరిగింది. జిల్లా స్థాయి నందు ఎంపికైన విద్యార్థిని విద్యార్థుల జాబితాను ప్రతిభ ఆధారంగా కంసాలిడేట్ చేసి త్వరలో ప్రకటించడం జరుగుతుందన్నారు. వీరు హకీంపేటలో ఈనెల30న జరిగే రాష్ట్రస్థాయిఎంపికలలో పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ గట్టు యాదవ్, వైస్ చైర్మన్ వాకిటి శ్రీధర్, వనపర్తి మండల ఎంఈవో శ్రీనివాస్ గౌడ్, వనపర్తి జిల్లా ఎస్‌జీఎఫ్ సెక్రటరీ సురేందర్ రెడ్డి,డీవైఎస్‌వో సుధీర్ కుమార్‌రెడ్డి, పీడీ,స్,పీఈటీస్, హాకీ కోచ్‌లు పాల్గొన్నారు.



క్రీడా పాఠశాలలకు ఎంపికలు నిర్వహిస్తున్న దృశ్యం

# కాంగ్రెస్ ఆధ్వర్యంలో బ్యాంకు ఎదుట ధర్నా

**- అకౌంట్ లాక్ పేరుతో రైతులను వేధిస్తున్నారు : మండల కాంగ్రెస్ కిసాన్ సెల్ అధ్యక్షుడు వెంకటరెడ్డి**

**వీపనగండ్ల,జూలై13,ప్రభాతవార్త:** వీపనగండ్ల మండల కేంద్రంలోని ఇండియన్ ఓవర్సిస్ బ్యాంక్ ముందు వీపనగండ్ల కిసాన్ సెల్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. తెలంగాణ ప్రభుత్వం రైతులకు ఇస్తున్న రైతుబంధు డబ్బులను బ్యాంకు సిబ్బంది, రైతు డబ్బులను డ్రా చేసుకునే వీలు లేకుండా అకౌంట్ హోల్డ్ అకౌంట్ లాక్ పేరుతో రైతులను వేధిస్తున్నారని కిసాన్ సెల్ మండల అధ్యక్షుడు వెంకట్ రెడ్డి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గోడదల బీరయ్య పాల్గొని, తెలంగాణ ప్రభుత్వం రైతులకు ఇస్తున్న రైతుబంధు, పింఛన్లను ఇవ్వకుండా అకౌంట్ లాక్ పేరుతో వేధిస్తున్నారని రైతులు వానకాలం పెటుబడికి డబ్బుల డ్రా చేసుకోవడానికి వీలు లేకుండా బ్యాంకు సిబ్బంది వ్యవహరిస్తున్నారని,ఇది చాలా బాధకరమని అన్నారు. అదే విధంగా రైతులకు ఎన్నికల సమయంలో లక్ష రూపాయల రుణమాఫీ చేస్తామని తెలంగాణ ప్రభుత్వం ఇప్పటిదాకా రైతు రుణమాఫీ చేయలేదని, అప్పులు తీసుకున్న రైతులు తమ వద్ద డబ్బులు పాత అప్పులకు జమ చేశామని బ్యాంకు సిబ్బంది చెబుతున్నారని రైతులు గగ్గోలు పెడుతున్నారని వారు తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం వెంటనే ఏకకాలంలో రైతులకు లక్ష రూపాయల రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు.రైతులకు ప్రభుత్వం నుండి ఎలాంటి సంక్షేమ పథకానికి నగదు అకౌంట్లో జమ చేసిన బ్యాంకు మేనేజర్, బ్యాంక్ సిబ్బంది రైతులకు ఇబ్బంది పెట్టకుండా వెంటనే ఇవ్వాలని బ్యాంక్ మేనేజర్‌కి కిసాన్ సెల్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నక్క విష్ణు ,ఆంజనేయులు, సాయిబాబా, కార్మిక ఈశ్వర్, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



బ్యాంకు మేనేజర్ రవీంద్రబాబుకు వినతిపత్రం అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

## బ్యాంకు అధికారుల తీరుకు నిరసనగా బ్యాంకు ఎదుట కాంగ్రెస్ ధర్నా

- ● రైతుబంధు సాయాన్ని రైతుల అప్పుకింద జమ చేసుకుంటున్న బ్యాంకు అధికారులు?
- ● రైతుల ఖాతాలను హోల్డ్ నుండి తొలగించాలి
- ● డీసీసీ జిల్లా కార్యదర్శి అయూబ్‌ఖాన్ డిమాండ్

**అమరచింత,జూలై13,ప్రభాతవార్త:** రైతుల పెట్టుబడి సహాయం రైతుబంధు ద్వారా ప్రభుత్వం రైతుల ఖాతాలో జమ చేస్తుంటే బ్యాంకు అధికారులు రైతుల అప్పుల పేరుతో రైతుల ఖాతాలను హోల్డ్‌లో పెట్టి రైతులను వేదిస్తున్నారని తక్షణమే బ్యాంకు అధికారులు రైతుల ఖాతాలను హోల్డ్‌ల నుండి తొలగించాలని డీసీసీ వనపర్తి జిల్లా కార్యదర్శి అయూబ్ ఖాన్ బ్యాంకు అధికారులను కోరారు. గురువారం అమరచింత యూనియన్ బ్యాంక్ ముందు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి బ్యాంకు మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి రైతులను ఉద్దేశించి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు లక్ష రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చిన ఇప్పటి వరకు రుణమాఫీ చేయకుండా రైతులు తీసుకున్న రుణాలకు వడ్డీలు పెరిగాయని ఆయన అన్నారు.ప్రభుత్వం రైతుబంధు సహాయం అని చెబుతూ బ్యాంకు అధికారులతో ప్రభుత్వం కుమ్మక్కై రైతుల రుణాలను అప్పుల కింద జమ చేసుకోవడం విడ్డూరంగా ఉందని ఆయన అన్నారు. ఇప్పటికైనా బ్యాంకు అధికారులు రైతుల రుణాలను రైతుబంధు సహాయాన్ని అప్పు కింద జమ చేయకుండా పెట్టుబడులకు ఇవ్వాలని, రైతుల ఖాతాలను హోల్డ్‌ల నుండి తొలగించాలని లేనిచో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన చేస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కిసాన్ సెల్ మండల అధ్యక్షుడు లక్ష్మికాంత్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కెజి మహేందర్‌రెడ్డి,కాంగ్రెస్ పార్టీ యువజన సంఘం మక్తల్ నియోజకవర్గం అధ్యక్షులు తులసిరాజు, తౌఫిక్ , శ్యాం, ప్రకాశం, విష్ణు, నాయకులు కార్యకర్తలు రైతులు పాల్గొన్నారు.



యూనియన్ బ్యాంకు మేనేజర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

## ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేత

**మక్తల్,జూలై 13 ప్రభాతవార్త:** ధరణి టెక్నికల్ స్టాఫ్ ఉద్యోగుల సమస్యలపై ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డికి వినతి పత్రం సమర్పించారు. మీ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారమయ్యే విధంగ చూస్తానని ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. ధరణి పోర్టల్ అనేది మన దేశానికి ఆదర్శం కావాల్సిన అవసరం ఉందని మన సేవలు ఎక్కడ కూడా రైతులకు ఇబ్బంది కలగకుండా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ధరణిటీం పాల్గొన్నారు.



ఎమ్మెల్యేకు వినతి పత్రం సమర్పిస్తున్న దృశ్యం

## బాధితుడిని పరామర్శించిన ఎంపీపీ మేఘారెడ్డి

**పెద్దమందడి,జూలై13,ప్రభాతవార్త:** మండల పరిధిలోని మోజర్ల గ్రామంలో సింగం నాగన్న అనే వ్యక్తి గురువారం పాము కాటుకు గురై వనపర్తి ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. పెద్ద మందడి వైస్ ఎంపీపీ రఘు ప్రసాద్ ఎంపీపీ మేఘారెడ్డి దృష్టికి తీసుకువెళ్లగా గురువారం ఉదయం ఏరియా ఆసుపత్రికి వెళ్లిబాధితుడు సింగం నాగన్నను ఎంపీపీ మేఘారెడ్డి పరామర్శించారు. ఆయన వెంట మాజీసింగిల్‌విండో అధ్య క్షులు ఐసత్యారెడ్డి, వైస్ఎంపీపీ రఘుప్రసాద్, మనిగిల్ల సుంచరమోని వెంకటయ్య తదితరులు ఉన్నారు.



పాము కాటుకు గురైన బాధితుడిని పరామర్శిస్తున్న ఎంపీపీ మేఘారెడ్డి

## మృతురాలి కుటుంబానికి ఎంపీపీ మేఘారెడ్డి ఆర్థిక సాయం



మృతురాలి కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న టీఎంఆర్ యువసేన నాయకులు

**పెద్దమందడి,జూలై13,ప్రభాతవార్త:** మండలపరిధిలోని అమ్మపల్లి గ్రామంలో వడ్డె వెంకటమ్మ అనే వృద్దురాలు బుధవారం అనారోగ్యంతో మృతి చెందింది. వెంకటమ్మ కుటుంబం పేదరికం గురించి గ్రామ సర్పంచ్ రమేష్ యాదవ్, సింగిల్‌విండో డైరెక్టర్ వెంకటేశ్వర్ రెడ్డి ,టీఎంఆర్ యువసేన నాయకులు బాలు ఎంపీపీ మేఘారెడ్డి దృష్టికి తీసుకువెళ్లగా తక్షణమే స్పందించిన ఎంపీపీ రూ.5వేలు పంపించారు. గ్రామానికి చెందిన టీఎంఆర్ యువసేన నాయకులు మృతురాలి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చి, రూ.5వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఆర్థిక సాయం అందజేసినవారిలో తిరుపాల్, వడ్డె గంగపురి, ఉద్య నాయక్, పాండు నాయక్, లక్ష్మణ్ నాయక్, వడ్డె మొగులయ్య, వడ్డె మనోహర్, వడ్డె వెంకటేష్, వడ్డె నాగరాజు, కేశవ్, తదితరులు ఉన్నారు.

## వెన్నెల మిల్క్ సెంటర్‌ను ప్రారంభించిన ఐక్యవేదిక అధ్యక్షుడు



వెన్నెల పాల కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సతీష్ యాదవ్

**వనపర్తి టౌన్,జూలై13,ప్రభాతవార్త:** పట్టణంలోని బ్రహ్మంగారి వీధికి వెళ్లే దారిలో తాటిపాముల యువకులు ఏర్పాటు చేసిన వెన్నెల పాల కేంద్రాన్ని గురువారం ఐక్యవేదిక అధ్యక్షుడు మాజీ కౌన్సిలర్ సతీష్ యాదవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా సతీష్ యాదవ్ మాట్లాడుతూ... యువకులు చదువుకుని ఉద్యోగాల మీదనే ఆధారపడకుండా స్వయం కృషితో ఇలాంటి వ్యాపారాలతో అభివృద్ధి చెంది వారి కుటుంబాలకు ఆధారంగా ఉండాలని మిగతా యువకులు ఆదర్శంగా ఉండాలని, మా పిల్లలు ఈ రోజు అభివృద్ధిలోకి రావడం మాకందరికీ సంతోషంగా ఉందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తాటిపాముల యువత, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## ఇంకుడు గుంతలు నిర్మించుకోండి

**- పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోండి : ఎంపీడీవో కథలప్ప**



**వీపనగండ్ల,జూలై13,ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని అన్ని గ్రామా లలో ప్రజలు వారి ఇంటి దగ్గర ఉండి ఖాళీ స్థలాలలో ఇంకుడు గుంతలు నిర్మాణం చేసుకోవచ్చని ఎంపీడీవో కథాలప్ప తెలిపారు. వానాకాలంలో నీరు వృధా కాకుండా,ఇంట్లో వాడే నీళ్ల రోడ్డు మీద వృధాగా పోయి అపరిశుభ్రంగా ఉంటుందని, ఇంకుడు గుంతలు తీసుకోవడం వలన ఇంట్లో వాడే నీటిని ఇంకుడుగుంతల్లో నిల్వచేసుకోవచ్చని తెలిపారు. ఇంకుడు గుంతల నిర్మించుకునే వారికి రూ.6400 అకౌంట్లో జమ చేయ దం జరుగుతుందని తెలిపారు. ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలనుకునే ప్రజలు వెంటనే ఎంపీడీవో ఆఫీస్ దగ్గరికి జాబ్ కార్డు , ఆధార్ కార్డు తీసుకుని రావాలని తెలిపారు.

## అడ్వకేట్‌పై దాడి చేయడం సిగ్గుచేటు

● **బిజెపి మండల అధ్యక్షుడు కురువ కృష్ణ**



మాట్లాడుతున్న బిజెపి నాయకులు

**మహ్మదాబాద్,జులై 13 ప్రభాతవార్త:** మండల కేంద్రంలో గురువారం భారతీయ జనతా పార్టీ మండల కార్యాలయంలో బిజెపి మండల అధ్యక్షుడు కుర్వ శ్రీను ఆధ్వర్యంలో మీడియా ప్రతినిధుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కురువ కృష్ణ మాట్లాడుతూ నిన్న తెరాస నాయకులు గండీడ్ మండల కేంద్రంలో ధర్నా, రాస్తారోకో చేసిన సందర్భంగా అటుగా వెళ్తున్న అడ్వకేట్‌పై దాడి చేయడం సిగ్గుచేటని అన్నారు. మండల పరిధిలో గత 9సంవత్సరాల్లో అనేక రాస్తారోకోలు, ధర్నాలు చేశాం కాని ఎక్కడా కూడా ఇతరులకు హాని కలిగించలేదన్నారు. బాధితులు కేసు చేస్తే తిరిగి బాధితులపై కేసులు నమోదు కల్వకుంట్ల రాజ్యాంగంలో చేస్తారు ప్రజలు భయభ్రాంతలకు గురై అడవిలోకి పారిపోదం అంటే కూడా చిన్న పింకి లీడర్లు, కాంగ్రెస్ నేతలు కలిసి అడవులను సైతం మింగే పనిలో ఉన్నారు. ఎలాగో తెరాసా ప్రభుత్వం రాదని తెలుసు కాబట్టిదళితబంధు వసూళ్లు,కళ్యాణలక్ష్మి చెక్కులు,అటవి భూములు, మింగే పనిలో ఉన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రజలు బిజెపి ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసేందుకు సిద్దంగా ఉన్నారని అన్నారు. కార్యక్ర మంలో బిజెపి మండల అధ్యక్షుడు కూర్వ కృష్ణ, ప్రధాన కార్యదర్శి కాశీ నాథ్ కిసాన్ మోర్చా జెడి గోపాల్, బూత్ కమిటి అధ్యక్షులు మల్లేష్, నరేష్, విక్కి బిజెవైఎంప్రధానకార్యదర్శిహరిప్రసాద్, ఆంజనేయులు పాల్గొన్నారు.

## రూరల్ పోలీస్ స్టేషన్ ఎస్సైగా జయప్రసాద్ బాధ్యతల స్వీకరణ



**నారాయణపేట ప్రతినిధి,జులై 13 ప్రభాతవార్త:** నారాయణపేట నూతన రూరల్ పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓగా ఎస్సై ఎస్.జయప్రసాద్ ఎస్పీ కార్యాలయంలో రిపోర్టు చేసి జిల్లా ఎస్పీ వెంకటేశ్వర్లుని పూలమొక్క అందించి మార్యాదపూర్వకంగా కలవడం జరిగింది. ఎస్పీ శుభాకాంక్షలు తెలిపి, త్వరలో నారాయణపేట నూతన రూరల్ పోలీస్ స్టేషన్ ప్రారంభోత్సవం చేయడం జరుగుతుందని తెలిపారు. ఇతను ఇంతకుముందు మహబూబ్‌నగర్ జిల్లాబాలానగర్ పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓగా విధులు నిర్వర్తించి బదిలీపై నారాయణపేట రూరల్ పోలీస్ స్టేషన్‌కు రావడం జరిగింది.

# పథకం నిరంతర ప్రక్రియ..ప్రతి లబ్ధిదారుడికి అందిస్తాం

**ఈ నెల 15 నుంచి ప్రతి నియోజకవర్గానికి 300 బీసీ కుల వృత్తుల కుటుంబానికి లక్ష ఆర్థిక సాయం : రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి గంగుల కమలాకర్**

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, జూలై 13 ప్రభాతవార్త:** బీసీ కుల వృత్తుల వారికి కుటుంబానికి రూ.1లక్ష చొప్పున రాష్ట్ర ప్రభుత్వం అందించే ఆర్థిక సహాయం కార్యక్రమం నిరంతర ప్రక్రియ అని, ప్రతి లబ్ధిదారులకు అందించడమే ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. గురువారం సాయంత్రం కరీంనగర్ కలెక్టరేట్ నుంచి రాష్ట్రంలోని అందరు కలెక్టర్ల, బీసీ సంక్షేమ శాఖ అధికారులతో బీసీ చేతి వృత్తుదారులకు ప్రభుత్వం అందించే ఆర్థిక సహాయం రూ.1లక్ష చెక్కుల పంపిణీపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి సమీక్షించారు ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ బీసీ కుల వృత్తులు నిర్వహించుకునే చేతి వృత్తిదారులకు ప్రభుత్వం నుంచి రూ.1లక్ష ఆర్థిక సహాయం ఈ నెల 15వ తేదీ నుంచి రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గానికి 300 మంది లబ్ధిదారుల చొప్పున రూ.1లక్ష చెక్కును అందించే కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు, ఈ పథకం ఓ నిరంతర ప్రక్రియ అని, రాష్ట్రంలోని ప్రతి విశ్వబ్రాహ్మణ, నాయి బ్రాహ్మణ, రజక, కుమ్మరి వంటి కులవృత్తులు చేతి వృత్తులనే నమ్ముకొని జీవిస్తున్న వారికి లక్ష ఆర్థిక సహాయం అందించడం జరుగుతుందని, ఏ ఒక్క లబ్ధి దారుడు కూడా నిరాశ చెందాల్సిన అవసరం లేదని, ప్రతి ఒక్కరికి ప్రతి మాసం కొంత మంది లబ్ధిదారులకురూ.1లక్ష చెక్కును అందించడం జరుగుతుందని మంత్రి స్పష్టం చేశారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సీఎం కేసీఆర్ చేతుల మీదుగా గత నెల 9న మంచిర్యాలలో ఈ పథకాన్ని లాంఛనంగా ప్రారంభించడం జరిగిందని మంత్రి గంగుల కమలాకర్ తెలిపారు.అదే విధంగా అన్ని నియోజకవర్గాల్లో మంత్రులు, ఎమ్మెల్యేలచే లబ్ధిదారులకు రూ.1లక్ష పంపిణీ చేయడం జరిగిందన్నారు. అదే విధంగా మొదటి విడతకు సంబంధించి ప్రతి నియోజకవర్గానికి 300 మంది చొప్పుననమోదు చేసుకున్న చేతి కుల వృత్తి దారులు అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేసి జిల్లా ఇన్‌చార్జి మంత్రుల ఆమోదంతో ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేలతో ఈనెల 15వ తేదీ నుంచి ఈ నెల 25వ తేదీ లోగా పంపిణీ కార్యక్రమాన్ని పూర్తి చేయాలని మంత్రి కలెక్టర్లను ఆదేశించారు.జిల్లా యంత్రాంగం పరిశీలించి లబ్ధిదారులను ఎంపిక చేసిన మంత్రి ఆమోదంతో ఎమ్మెల్యేల ద్వారా లబ్ధిదారులకు రూ.1లక్ష ఆర్థిక సహాయం చెక్కుల పంపణీకి కావాల్సిన నిధులను కలెక్టర్ ఖాతాలోకి జమ చేయడం జరుగుతుందన్నారు. చేతి వృత్తిదారుల జీవితాల్లో వెలుగులు నింపి, వారికి ఆర్థిక భరోసాను అందించడం, గౌరవ ప్రదమైన జీవనం కొనసాగించేందుకు సీఎం కేసీఆర్ నిరంతరం తపన పడుతుంటారని మంత్రి చెప్పారు. ఈ పథకం ద్వారా వారి జీవితాల్లో ఆర్థిక స్వావలంబనకు అవకాశం ఏర్పడుతుందని చెప్పారు. లబ్ధిదారులు వృత్తి పనిముట్లు, ముడిసరుకు కొనడానికి ఈ నిధులు ఉపయోగపడుతాయని, దీని ద్వారా లబ్ధిదారులు ఆర్థిక స్వావలంబన సాధించడంలో అధికార యంత్రాంగం నిరంతరం తోడ్పాటునందించాలని ఆయన సూచించారు. హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న బీసీ సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం మాట్లాడుతూ ఈ మాసానికి సంబంధించిన నియోజకవర్గానికి 300 మంది లబ్ధిదారులకు ఈ మాసంలోనే అందించాలని, రానున్న ప్రతి మాసంలో కొంత మంది లబ్ధిదారులకు అందే వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుందన్నారు. ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్న ప్రతి ధరఖాస్తులను ఎంపీడీఓల ద్వారా వెరిఫికేషన్ ప్రక్రియను ఈ నెల 18లోగా పూర్తి చేయాలని ఆదేశించారు.అనంతరం జిల్లా కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్ మాట్లాడుతూ జిల్లా నుంచి ఆన్‌లైన్‌లోనమోదు చేసుకున్న 20670మంది ధరఖాస్తులు చేసుకోగా 11004 ధరఖాస్తులను లబ్దిదారులుగాఎంపిక చేయడం జరిగిం దని,720 ధరఖాస్తులు పథకానికి అనర్హులుగా గుర్తించడంజరిగిందని,8946 ధరఖాస్తులను ఈ నెల 18లోగా వెరిఫికేషన్ చేసి పూర్తి చేస్తామన్నారు. అర్హులుగా ఎంపికైన జాబితా నుంచి జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల్లోని 1200 మంది లబ్దిదారులకు ఈ నెల 15వ తేదీ నుంచి లక్ష రూ॥ల చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని జిల్లాలో సమర్థవంతంగా నిర్వర్తిస్తామని తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారి శ్రీధర్‌జీ, కల్వకుర్తి ఆర్డీఓ రాజేష్‌కుమార్, సెక్షన్ ఇన్‌చార్జి జనార్దన్ పాల్గొన్నారు.


వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్

## అభివృద్ధి పనులపై కలెక్టర్ సమీక్ష


అధికారులతో సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

**నారాయణపేట ప్రతినిధి,జూలై 13 ప్రభాతవార్త:** జిల్లాలో సుమారు రూ. 30 కోట్లతో జరుగుతున్న అభివృద్ధి పనులలో జాప్యంపై జిల్లా అధికారులతో జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష గురువారం సమావేశం నిర్వహించారు. ఈసమీక్ష సమావేశంలో స్పెషల్ డెవలప్‌మెంట్ ఫాండ్స్ కింద జిల్లాలోని మున్సిపాలిటీలలో గ్రామ పంచాయతీలలో వివిధ నిర్మాణాలు, రోడ్డు విస్తరణ పనులు జాప్యం అవడంపై ఆర్అండ్‌బి అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లా కేంద్రంలో నిర్మిస్తున్న బాలభవన్ పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు. అపక్‌పల్లి నుంచి కోయిలకొండ రోడ్డు నిర్మాణ పనులు, మక్తల్, నారాయణపేట రోడ్డు మరమ్మతు, ఆత్మకూర్, మరికల్‌రోడ్డు మరమ్మతు పనులు వెంటనే చేపట్టాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. జిల్లా కేంద్రంలో నిర్మిస్తున్న సేవాలాల్ భవనంపనులు వెంటనే ప్రారంభించాలని, వైకుంఠ ధామం పనులు నిర్లక్ష్యం వహించకుండా త్వరగా పూర్తి చేయాలన్నారు. బిసి కాలనీలో పనులు, వీరసావార్కర్ నుండి అంబేద్కర్ చౌరస్తా వరకు పనులు నిర్లక్ష్యంగా అవగాహన చేశారు.ధన్వాడ, మరికల్ మండల కాంప్లెక్స్, బస్టాండ్ నిర్మాణ పనులు, జిల్లా కేంద్రంలో ప్రధాన కూడళ్లలో బస్ షెల్టర్లు ఏర్పాటు చేయాలన్నారు.అభివృద్ధి కార్యక్రమాలు త్వరగా పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ మయాంక్ మిత్తల్ సిపిఓ గోవిందరాజన్, విజయ్‌భాస్కర్, డివిఎస్ మల్లేష్, నరెందర్,స్వామి, మహేష్, రాములు పాల్గొన్నారు.

## ఘనంగా అమరజీవి కామ్రేడ్ అరుణ మూడో వర్ధంతి


విద్యార్థులను సన్మానిస్తున్న దృశ్యం

**మిడ్జిల్,జూలై 13 ప్రభాతవార్త:** మండల కేంద్రంలో అమరజీవి కామ్రేడ్ అరుణ మూడవ వర్ధంతిని కెటిఆర్ పంక్షన్ హాల్‌లో గురువారం అరుణ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఐద్వా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కామ్రేడ్ హైమావతి రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి. సాగర్ మాట్లాడుతూ దేశంలో బిజెపి ప్రభుత్వం వచ్చాక నిత్యావసర ధరలు భగ్గుమంటున్నాయని ప్రభుత్వం ఏ మాత్రం పట్టించుకోవడం లేదని నిత్యావసర ధరలు పెరగడంతో ప్రజలకు పెనుభారంగా మారిందని వారన్నారు. నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించి ప్రజలనాదుకోవాలని డిమాండ్ చేశారు.అదేవిధంగా కామ్రేడ్ అరుణఅమరజీవి అని ప్రజలగుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయినటువంటి వ్యక్తి అని కొనియాడారు. అరుణ కుటుంబ పోషణ విషయంలో గాని, పట్టుదలతో ఉన్నత విద్యనభ్యసించి గ్రామ సర్పంచ్‌గా, అనేక పదవులను చేపట్టి పట్టుదలతో ముందుకు నడిపించిందని గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపించిందని వారు పేర్కొన్నారు. అనంతరం అరుణ జ్ఞాపకార్థకంగా మండలంలో ఉన్నత పాఠశాలలో 10వ తరగతి పరీక్షలలో ఉన్న 12 మంది విద్యార్థులను ఘనంగా సన్మానించి వారికి పారితోషికము రూ.5 వేలు ఇవ్వడం జరిగింది.కార్యక్రమంలో కెవిపిఎస్ నాయకులు పరశురాములు, సర్పంచ్‌లు శ్రీనివాసులు, జంగయ్య, జానుగుడ్ల బాలయ్య, వివిధ గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

## పిసిసి అధ్యక్షులు రేవంత్‌రెడ్డి క్షమాపణలు చెప్పాలి



**మిడ్జిల్,జూలై 13 ప్రభాతవార్త:** టిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు జడ్చర్ల ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి పిలుపు మేరకు గురువారం మండల సబ్ స్టేషన్ ఆవరణలో మండల టిఆర్ఎస్ నాయకులు తెలంగాణ పిసిసి అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను ఉరితీసి దహనం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో రైతన్న కోసం కెసిఆర్ ప్రభుత్వం ఇస్తున్న ఉచిత్ విద్యుత్ అవసరం లేదంటూ రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు వెనకకు తీసుకుని తెలంగాణ రైతన్నకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. తెలంగాణలో కరెంటు లేక సమయానికి ఎరువులు లేక విత్తనాల కోసం చెప్పులు లైన్‌లో పెట్టి ఎరువులు పంచిన ఘనత కాంగ్రెస్‌కు దక్కిందని తెలిపారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత సాగునీరు రైతుబంధు, రైతుభీమా వరి కొనుగోళ్ల కేంద్రాలతోపాటు మరెన్నో సంఖ్య అభివృద్ధి సంక్షేమ పథకాలు అమలు చేయడంలో రైతులు సంతోసంగా ఉండడంఇష్టం లేక రైతులపైఈ విధమైన మాటలు మాట్లాడుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఎంపిపి సుదర్శన్, జడ్పీటిసి శశిరేఖ బాలు, టిఆర్ఎస్‌పార్టీ మండల అధ్యక్షులు పాండు యాదవ్, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులు జంగారెడ్డి, రైతు సమన్వయ సమితి అధ్యక్షులు శ్రీనివాస్‌గౌడ్, సర్పంచ్‌లురాధిక వెంకట్‌రెడ్డి, నారాయణరెడ్డి, రాధిక ప్రతాప్‌రెడ్డి, మంగమ్మ శ్రీనివాసులు, టిఆర్ఎస్ జిల్లా నాయకులు, పిఎసిఎస్ ఛైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి శ్రీనివాస్‌గుప్తా,గుడ్లబాలయ్య, వీరారెడ్డి, లక్ష్యం భవన్ విజయ్ నాయక్, గోపాల్,రవింద్ర, బుచ్చయ్య, జంగయ్య, సురేష్, సత్యంగుప్తా పాల్గొన్నారు.

## డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి

**భూత్పూర్,జూలై 13 ప్రభాతవార్త:** దేవరకద్ర నియోజకవర్గంలో మంజూరైన డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేసి లబ్దిదారులకు అందించాలని ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి అధికారులను కోరారు. గురువారం అన్నాసాగర్‌లో ఎమ్మెల్యే ఆల పంచాయతీరాజ్ అధికారులు, ఇంజనీర్ల సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో చేపట్టిన హెల్త్ సబ్‌సెంటర్లు, గ్రామ పంచాయతీ భవనాలు, డబుల్ బెడ్ ఇళ్ల నిర్మాణాలు సకాలంలో పూర్తి చేయాలని, పాఠశాలల్లో చేపట్టిన అదనపు తరగతి గదుల నిర్మాణాలు వెంటనే పూర్తి చేయాలని సూచించారు. మన ఊరు మనబడి కార్యక్రమాన్ని ఈ నెలాఖరు వరకు పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఈఈలు మల్లయ్య, నరెందర్, డిఈఈలు నాగేశ్వర్‌రావు, అనిల్‌కుమార్, ఏఈలు కురుమూర్తి, షబ్బీర్, లక్ష్మణ్, ఇతర అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.


పిఆర్ అధికారులు, ఇంజనీర్ల సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యేఆల

# మైనార్టీ సంక్షేమానికి పెద్దపీట

**●ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి వీ శ్రీనివాస్‌గౌడ్ ●150మంది బీఆర్ఎస్‌లో చేరిక**

**మహబూబ్‌నగర్ బ్యూరో, జూలై13, ప్రభాతవార్త:** మైనార్టీ సంక్షేమానికి తమ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి వీ శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. మహబూబ్‌నగర్ న్యూటౌన్‌లోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మైమాన్ కమిటీకి చెందిన సిరాజ్, మహ్మద్ ఫురాన్, మహ్మద్ ఫరహాన్, జహీదాబాను, రిజ్వానా బాను,నసీం, రహమత్‌ఉన్నీసా,సుల్తానా సహా150మందికిపైగా మైనార్టీలు మంత్రి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తెలంగాణ వచ్చాక నియోజకవర్గంలో 6మైనార్టీ గురుకులాలు, 6జూనియర్ కళాశాలలు ప్రారంభించినట్లు తెలిపారు. నూతన మైనార్టీ గురుకులాల నిర్మాణం కోసం రూ.128కోట్లు మంజూరై ప్రస్తుతం పనులు జరుగుతున్నాయన్నారు. ముఖ్యమంత్రి విదేశి విద్యానిధి పథకం ద్వారా పేద మైనార్టీలకు విదేశాల్లో చదువుకోవడానికి ఒక్కొక్కరికి రూ.20లక్షలు మరియు విమానంటికెట్టు కోసంరూ.60వేల ఆర్థికసాయం అందిస్తున్నామన్నారు. ఇప్పటివరకు నియోజకవర్గంలో ఈ పథకం ద్వారా రూ.3.4కోట్ల మేరకు అందించామన్నారు. డ్రైవర్ ఎంపవర్‌మెంట్ పథకం వాహనాలు కొనుగోలు చేసేందుకు రుణాలు అందించామన్నారు. నియోజకవర్గంలో 20,355 మంది విద్యార్థులకు రూ.31.12కోట్ల మేర ఉపకార వేతనాలు ఇచ్చినట్లు తెలిపారు. మైనార్టీ విద్యార్థులకు పోస్ట్ మెట్రిక్ హాస్టళ్ల సౌకర్యం కోసం ఇప్పటివరకు రూ.1.26కోట్లు ఖర్చు చేసినట్లు వెల్లడించారు. నిరుపేదల ముస్లింలకు 64వేల రంజాన్ కానుకలు పంపిణీ చేశామన్నారు. రూ.కోటితో షాదీఖానా నిర్మాణం చేపట్టామని, హజ్ హౌజ్ నిర్మాణానికి రూ.50లక్షలు విడుదల చేశామన్నారు. మునుపెన్నడూ లేనివిధంగా మైనార్టీ విద్యార్థులకు గ్రూప్స్, కానిస్టేబుల్, ఎస్సై పోస్టులకు ఉచిత శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. షాదీముబారక్ కింద నియోజకగర్గంలో 2940 మంది లబ్ధిదారులకు రూ.28.49 కోట్లు పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రహెమాన్, పార్టీ పట్టణాధ్యక్షుడు శివరాజ్, ప్రధాన కార్యదర్శి వినోద్, నాయకులు ముక్తదీర్, హమ్మద్ ఫైజాన్, మీర్జాజావేద్ బేగ్, హరున్, వాజీద్ పాల్గొన్నారు.


మైనార్టీలను పార్టీలోకి ఆహ్వానిస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్

# విద్యార్థులకు బస్ పాస్‌ల పంపిణీ

**ధరూర్,జూలై 13 ప్రభాతవార్త:** మండల కేంద్రంలో బస్ పాస్ పంపిణీ కార్యక్రమానికి ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి హాజరయ్యారు. ముందుగా ఉప్పేర్ గ్రామంలోని జడ్పీహెచ్ఎస్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో కలిసి పాఠశాల నుండి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వరకు ఎమ్మెల్యే విద్యార్థులతో కలిసిబస్సులో ప్రయాణించారు.అనంతరం ధరూర్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బస్‌పాస్ పంపి ణీ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి, సతీమణి బండ్లజ్యోతి హాజరయ్యారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలోని సరస్వతి దేవి విగ్రహానికి ఎమ్మెల్యే పూలమాల వేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ ఛైర్మన్ జంబురామన్‌గౌడ్, ఎంపిపి నజీమున్నిసాబేగం,జడ్పీటిసి పద్మా వెంకటేశ్వర్‌రెడ్డి, వైస్ ఎంపిపి సుదర్శన్‌రెడ్డి, ధరూర్ మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు రఘువర్ధన్‌రెడ్డి, సర్పంచ్‌లు పద్మమ్మ,శివారెడ్డి, విజయభాస్కర్‌రెడ్డి, సత్యారెడ్డి, గద్వాల టౌన్ పార్టీ ప్రధాన కార్యదర్శి సాయిశ్యామ్‌రెడ్డి, బిఆర్ఎస్ పార్టీ నాయకులు కృష్ణరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, సర్వారెడ్డి, డిఆర్ శ్రీధర్, ప్రభాకర్‌గౌడ్,విజయరెడ్డి, శ్రీరాములు,హనుమంత్‌రెడ్డి,ప్రభాకర్‌రెడ్డి, జిల్లా సమన్వయకర్తలు చక్రధర్‌రెడ్డి, రామకృష్ణనాయుడు, మండల పార్టీ యూత్‌ప్రధాన కార్యదర్శిసంజీవ్, ఉపాధ్యక్షుడు జాంపల్లి భరతసింహారెడ్డి, నరేష్‌గౌడ్, ఆర్టీసి ఎండి జిల్లా విద్యాధికారి, మండల ఎంఈఓ, సురేష్, ప్రధానోపాధ్యాయులు, బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, యూత్ సభ్యులు పాల్గొన్నారు.


విద్యార్థులకు బస్‌పాస్‌లు అందజేస్తున్న ఎమ్మెల్యే

# 18 ఏళ్లు నిండిన వారికి ఓటుహక్కు నమోదు చేయాలి

**ఇటిక్యాలలో ఓటరు నమోదును పరిశీలించిన ఎంపిడిఓ రాఘవ**

**ఇటిక్యాల,జూలై 13 ప్రభాతవార్త:** మండల పరిధిలోని 29 గ్రామ పంచాయతీలలో 18 నుండి 21 సంవత్సరాల వయసుగల వారందరికి గ్రామంలో బూత్ లెవల్ అధికారులు వారి వివరాలు సేకరించాలని అర్హులు ఉన్నట్లయితే ఫారం 6 ద్వారా లేదా ఆన్‌లైన్ రిజిస్టర్ ద్వారా నమోదు చేయించుకునేలా అవగాహన కల్పించాలని ఎంపిడిఓ రాఘవ బూత్ లెవల్ అధికారులకు వివరించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలో 18 ఏళ్ల నుండి 21 సంవత్సరం ఉన్నవారు 4356 మందిని గుర్తించారని వారి ఇళ్లకు వెళ్లి గ్రామంలో ఓటుహక్కు ఉందా లేదా ఇప్పటికే ఓటుహక్కు కోసం ఆన్‌లైన్ ద్వారా రిజిస్టర్ చేసుకున్నారా లేదా జాబితాలో ఉన్నవారి వివరాల ప్రకారం వీరిలో ఎవరైనా చనిపోయి ఉంటే ఆ ఓటుహక్కును తొలగించాలని 18 ఏళ్లపై బడిన వారు ఓటుహక్కు లేకపోతే వారి వివరాలు సేకరించి నమోదు చేయాలని ఎంపిడిఓ రాఘవ పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. గురువారం ఈ సందర్భంగా ఇటిక్యాల మండల కేంద్రంలో జాబితాలో ఉన్నవారి ఇంటికి వెళ్లి వివరాలుఅడిగి తెలుసుకున్నారు. త్వరగా జాబితా ప్రకారం వివరాలను సేకరించాలని సూచించారు. అంతేకాక ఇటిక్యాల రైల్వే స్టేషన్ సమీపంలో ఉన్న అవెన్యూ ప్లాంటేషన్‌ను ఎంపిడిఓ పరిశీలించారు. అదేవిధంగా వర్షాకాలం కావడంతో హరిత హారంలో భాగంగా మండల కేంద్రం నుండి ఉదండాపురం గ్రామం వరకు రోడ్డు వెంటమొక్కలు నాటేందుకుఉపాధి కూలీలు గుంతలు తవ్వుతుండగా ఎంపిడిఓ రాఘవ పరిశీలించారు.కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్ కృష్ణ, పంచాయతీ కార్యదర్శి నాగరాజు పాల్గొన్నారు.


18 ఏళ్లు పైబడిన వారి వివరాలను సేకరిస్తున్న ఎంపిడిఓ రాఘవ

## హ్యూమన్ రైట్స్ సేవలు అభినందనీయం



**చిన్నచింతకుంట,జూలై 13 ప్రభాతవార్త:** గ్రామీణ యువత కోసం నిత్యం హ్యూమన్ రైట్ సంస్థ చేస్తున్న సేవలు అభినందనీయమని తహసిల్దార్ సువర్ణరాజు తెలిపారు. గురువారం మండల కేంద్రంలోని స్థానిక గ్రంథాలయానికి ఆల్ ఇండియా కౌన్సిల్ ఆఫ్ హ్యూమన్ రైట్స్ లిబరిటిష్ అండ్‌సోషల్ జస్టిస్ ఆధ్వర్యంలో ఆ సంస్థ రాష్ట్ర అధ్యక్షులు ఎద్దుల రమాకాంత్‌రెడ్డి రూ. 21 వేల విలువ గల కాంపిటిటివ్ పరీక్ష పుస్తకాలను ఉచితంగా అంజేశారు. మండల తహసిల్దార్ సువర్ణరాజు హాజరై మాట్లాడుతూ ఈ ప్రాంతానికి చెందిన నెల్లికొండి గ్రామ నివాసి ఎద్దుల రమాకాంత్‌రెడ్డి ఎన్నో ఏళ్లుగా ఈ ప్రాంతంలోని పేద విద్యార్థులతో పాటు యువకులకు హ్యూమన్ రైట్స్ సంస్థ ద్వారా సహాయ సహకారాలు అందించడం హర్షించదగ్గ విషయమన్నారు. సమాజ శ్రేయస్సు తో పాటు యువత భవిష్యత్తు పట్ల రమాకాంత్‌రెడ్డి చేస్తున్న కృషిని ఆయన కొనియాడారు. కాంపిటిషన్ పరిస్థితుల్లో ఎంతో విలువగల పుస్తకాలను ఇక్కడి గ్రంథాలయంకు ఉచితంగా అందించడం సంతోషకరమైన విషయమన్నారు. యువత పుస్తకాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి చంద్రయ్య పాల్గొన్నారు.

## సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

**చిన్నచింతకుంట,జూలై 13 ప్రభాతవార్త:** సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని స్థానిక ఎస్సై ఆర్. శేఖర్ తెలిపారు. కమ్యూనిటి పోలీస్ కార్యక్రమంలో భాగంగా గురువారం అల్లిపూర్ గ్రామంలోని ప్రజలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల కార్మికులను పనిలో చేర్చుకుంటే చట్టరిత్యా నేరమని తెలిపారు. బాల్య వివాహాలు జరపరాదని అలా జరిపితే కఠినంగా శిక్షలు తప్పవని హెచ్చరించారు. ఆపద సమయంలో 100కు డయల్ ఫోన్ చేయాలని గ్రామ ప్రజలకు సూచించారు. పలు సామాజిక రుగ్మతలపై ప్రజలకు అవగాహన కల్పించారు.కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న పోలీస్ సిబ్బంది

## రిటర్నింగ్ అధికారుల నియామకం

**- నియోజకవర్గాలకు నియమిస్తూ ఈసీ ఉత్తర్వులు**

**మహబూబ్‌నగర్ బ్యూరో, జూలై 13, ప్రభాతవార్త:** అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ఎన్నికల నిర్వహణ ప్రక్రియను ఎన్నికల సంఘం మరింత వేగవంతం చేసింది. ఇందులో భాగంగా నియోజకవర్గాలకు రిటర్నింగ్ అధికారులను నియమిస్తూ ఎన్నికల సంఘం ఉత్తర్వులు జారీ చేసింది. మహబూబ్‌నగర్ నియోజకవర్గ రిటర్నింగ్‌అధికారిగా ఆర్డీవో,జడ్చర్ల నియోజకవర్గ రిటర్నింగ్ అధికారిగా అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ), దేవరకద్ర రిటర్నింగ్ అధికారిగా భీమా ప్రాజెక్టు స్పెషల్ కలెక్టర్ నియామకం అయ్యారు. నారాయణపేట రిటర్నింగ్ అధికారిగా ఆర్డీవో, మక్తల్‌కు అడిషనల్ కలెక్టర్ (లోకల్ బాడీస్), వనపర్తి రిటర్నింగ్ అధికారిగా అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ), గద్వాల నియోజకవర్గానికి అడిషనల్ అడిషనల్ (రెవెన్యూ), అలంపూర్‌కు గద్వాల ఆర్డీవో నియామకయ్యారు.నాగర్‌కర్నూల్,అచ్చంపేట,కల్వకుర్తి నియోజకవర్గాలకు ఆయాడివిజన్ల ఆర్డీవోలురిటర్నింగ్ అధికారులుగా నియామకయ్యారు.కొల్లాపూర్ నియోజకవర్గానకి నాగర్‌కర్నూల్ జిల్లా అడిషనల్ కలెక్టర్ నియామకమయ్యారు. షాద్‌నగర్ నియోజకవర్గానికి అదే డివిజన్ ఆర్డీవో , కొడంగల: నియోజకవర్గానికి వికారాబాద్ అడిషనల్ కలెక్టర్(రెవెన్యూ) రిటర్నింగ్ అధికారులుగా నియామకం అయ్యారు.

## ఎస్సైని సన్మానించిన బిఆర్ఎస్ నాయకులు



**భూత్పూర్,జూలై 13 ప్రభాతవార్త:** భూత్పూర్ పిఎస్‌కు నూతన ఎస్సైగా విచ్చేసిన శ్రీనివాస్‌ను భూత్పూర్ బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు గురువారం పిఎస్‌లో శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. మండల గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ గడ్డం యాదయ్యతో పాటు నాయకులు బజార్ పరశురాం, రమేష్, నవీన్, రాములు, వెంకటయ్య పాల్గొన్నారు.

## ఎన్నికలకు సిద్ధం కండి..వచ్చేది ఇందిరమ్మ రాజ్యమే

**అలంపూర్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో వెల్లడించిన సంపత్‌కుమార్**



**అలంపూర్,జూలై 13 ప్రభాతవార్త:** అలంపూర్ మండలం భీమవరం గ్రామంలో గురువారం అలంపూర్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రాము ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ముఖ్య అతిథులుగా ఏఐసిసి కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే డా. ఎస్.ఎ సంపత్‌కుమార్ పాల్గొని కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా సంపత్‌కుమార్ మాట్లాడుతూ తెలంగాణ విద్యార్థుల బలిదానాలతో గుండె కదిలి తల్లి సోనియా గాంధి ఇచ్చిన తెలంగాణలో కుటుంబ, నియంత పాలన కొనసాగుతోంది. తెలంగాణ ప్రజలు గడీల పాలనలో బందీలయ్యారని టిఆర్ఎస్ ప్రభుత్వంపై సంపత్‌కుమార్ మండపడ్డారు.బంగారు తెలంగాణ ఇస్తానన్న కెసిఆర్ తన కుటుంబ బ్రతుకును బంగారుగా మార్చుకున్నారు తప్ప ప్రజల సమస్యలు ఏనాడు పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తంచేశారు. కెజిటు పిజి, ఇంటికో ఉద్యోగం, రైతుకు లక్ష రుణమాఫీ, డబుల్ బెడ్‌రూం, మూడెకరాల భూమి, మైనార్టీలకు రిజర్వేషన్ లాంటి హామీలు ఇచ్చి మాట తప్పి తెలంగాణ ప్రజలను మోసం చేశాడని కెసిఆర్‌పై దుయ్యబట్టారు. కార్యక్రమంలో డిసిసి జనరల్ సెక్రెటరీ భీమవరం శేఖర్‌రెడ్డి, అలంపూర్ మండల అధ్యక్షుడురాము,ఉండవెల్లి మండల అధ్యక్షుడు గోపాల్, ఇటిక్యాల మండల అధ్యక్షుడు రుక్మదరెడ్డి, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎర్రవల్లి రవి,మహిళా అధ్యక్షురాలు నాగశిరోమణి, పిసిసి అధికార ప్రతినిధి షేక్షావలి చారి,షేక్షావలి ఆచారి,జిల్లా ఎస్సీ సెల్ అధ్య క్షుడు మద్దిలేటి,జిల్లా కార్యదర్శి బుక్కాపురం లక్ష్మణ్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి జగన్ గౌడ్,కొంకల యోగిరెడ్డి, అలంపూర్‌యూత్ కాంగ్రెస్ అధ్య క్షుడు శ్రీనివాసులు,అలంపూర్ టౌన్ అధ్యక్షుడు ఆఫీస్ ఖాన్, పచ్చర్లకుమార్ పాల్గొన్నారు.

## సంకల్ప రథయాత్ర గోడపత్రిక విడుదల



**ఉప్పునుంతల,జూలై 13 ప్రభాతవార్త:** టిఎస్ సిపిఎస్ఇయు ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా 33 జిల్లా కేంద్రాల్లో జరిగే పాత పెన్షన్ సాధన సంకల్ప రథయాత్రగోడపత్రికను గురువారం తహసిల్దార్ కార్యాలయం,ఎంపిడిఓ కార్యాలయం, ప్రాథమిక ఆరోగ్యకేంద్రం, ఉన్నత, ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలో తహసిల్దార్ శైలేంద్రకుమార్ చేతుల మీదుగావిడుదల చేశారు.ఈసందర్భంగా జిల్లా ఉపాధ్యక్షుడు గోపాలనాయక్ మాట్లాడుతూరాష్ట్రంలోని లక్ష80వేలమంది ఉద్యోగులందరికి శాపంగా మారిన నూతన పెన్షన్ విధానం రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలనే ఏకైక నినాదంతో జూలై 17న నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో జరిగే పాత పెన్షన్ సాధన సంకల్పరథయాత్ర కార్యక్రమాన్నివిజయవంతం చేయాలనిపిలుపునిచ్చారు.కార్యక్రమంలోరాజేశ్వర్‌రెడ్డి,వినోద్, ఆంజనేయులు, వెంకటేష్, రాజేష్, ఉమాశంకర్, కళావతి, లలిత, వెంకటేష్ పాల్గొన్నారు.

## రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం

**ఉప్పునుంతల,జూలై 13 ప్రభాతవార్త :** కాంగ్రెస్ పార్టీ టిపిసిసి అధ్యక్షుడు ఎనుముల రేవంత్‌రెడ్డి కరెంటు సరఫరాపై అనుచిత వ్యాఖ్యలు చేయడంతో గురువారం మండల కేంద్రమైన ఉప్పునుంతల సబ్ స్టేషన్ ముందు బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు కొత్త రవిందర్‌రావు ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం టిపిసిసి అధ్యక్షుడు ఎనుముల రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మదగ్ధం చేశారు. ఈ ఆందోళన కార్యక్రమంలో డిసిసిబి డైరెక్టర్,సింగిల్ విండో ఛైర్మన్ సత్తు భూపాల్‌రావు, బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు కట్ట గోపాల్‌రెడ్డి, అచ్చంపేట పాలశీతలీకరణ ఛైర్మన్ కట్ట గోపాల్‌రెడ్డి, గ్రామ కమిటి అధ్యక్షుడు మెడమోని శ్రీనివాసులు, మాజీ ఎంపిటిసి మాన్యనాయక్, చిన్న జంగయ్య, ఎల్లయ్య యాదవ్, సిహెచ్ సుధాకర్ పాల్గొన్నారు.